తెలుగు దినపత్రిక

సిరి

People's Voice వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

24-07-2026

శుక్రవారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 166

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక

సిరి People's Voice వార్తపత్రిక

RNI:TGTEL/26/A0381

siridailynews@gmail.com

/siridailynews

@siridailynews

epaper.siridaily.com

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575

పోటీ ప్రపంచంలో సింగరేణి నిలదొక్కుకోవాలి

- అందుకు సహకరించడమే ప్రభుత్వ లక్ష్యం
- సింగరేణితో భావోద్వేగ బంధం
- జెన్ కోకు నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలి
- బొగ్గు సింగరేణికి ప్రధాన ఆదాయ వనరు

3

- క్రిటికల్ మినరల్స్ అన్వేషణ, మైనింగ్ ప్రక్రియలోకి సింగరేణి ప్రవేశించాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

మహానగరం మధ్యన పేదోడికి ఇల్లు ఉండొద్దా?

- పదేళ్లు చేయలేనిది కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే విష ప్రచారమా?

2

- ఇండ్ల కేటాయింపులో బీసీలకు 50 శాతం రిజర్వేషన్
- రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి

ప్రతీ విద్యార్థి నుంచి అభిప్రాయ సేకరణ

- యూనిఫాంల నాణ్యతపై రాజీ పడేది లేదు
- పంపిణీలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

3

- త్వరగా సరఫరా చేసేలా సంస్థలపై ఒత్తిడి పెంచాలి
- యూనిఫాం సరఫరాపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

ఏది నిజం..? ఎవరిది పాపం.. ఎవరికి శాపం?

- పోలీస్ వ్యవస్థకే మచ్చగా మారిన ట్రైనీ ఐపీఎస్‌ల వ్యవహారం
- ఉన్నత స్థానానికి వెళ్లే తరుణంలో వెకిలి చేష్టలేంది?!
- హైదరాబాద్ ఎన్పీఏలో సంచలనంగా ట్రైనీ ఐపీఎస్‌ల వివాదం

3

- పోలీస్ కేసుల వరకు వెళ్లిన వివాదం..
- తప్పుడు ఆరోపణలంటూ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం
- కానిస్టేబుల్ స్థాయి నుండి 350వ ర్యాంక్ సాధించి ఐపీఎస్ పొందిన ఉదయ్ కృష్ణారెడ్డి
- ట్రైనీ అధికారినితో ప్రేమ వ్యవహారమే కెరీర్‌ను కూల్చివేసిందా?
- వేధింపులు, గదిలోకి లాక్కెళ్లారనే ఫిర్యాదు ఆధారంగా సస్పెన్షన్
- ఘటనపై ఉమెన్స్ వింగ్ డీసీపీ స్థాయి అధికారితో విచారణ

దాడుల్లో ఉన్న దూకుడు విచారణలో లేదేం..?!

- నిత్యం కేసులు.. నిర్ధారణ మాత్రం శూన్యం
- పట్టుబడ్డప్పుడు కోట్ల ఆస్తులు..
- విచారణలో విలువ తగ్గుతుందెందుకు?!
- తగ్గుతున్న ఆస్తుల విలువపై వెల్లువెత్తుతున్న అనుమానాలు
- కొత్త ప్రభుత్వం వచ్చాక 512 కేసులు..
- రూ.1,300 కోట్ల అక్రమాస్తులు గుర్తించినట్లు ప్రకటనలు
- అక్రమాస్తుల మార్కెట్ విలువ రూ.13 వేల కోట్లకు పైమాటే!
- అరెస్టయిన రెండేళ్లకే మళ్లీ కీలకమైన, కాసులు కురిపించే కుర్చీల్లోకి..
- దర్జాగా మళ్లీ అదేబాటలో అవినీతి అధికారులు
- సరిగా విచారించకపోవడం వల్ల బలవుతున్న నీతిమంతులైన అధికారులు

తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:

'అవినీతి అధికారిపై ఏసీబీ దాడులు.. రూ.300 కోట్ల అక్రమాస్తులు లభ్యం.. కిలోల కొద్దీ బంగారం, విదేశీ మద్యం, బినామీల పేరిట వందల ఎకరాల భూములు, రియల్ ఎస్టేట్‌లో కోట్ల పెట్టుబడులు గుట్టురట్టు..' అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు చేసిన ప్రతీసారి ఇచ్చే పత్రికా ప్రకటన లివి. అయితే, దాడుల్లో చూపించే ఈ ఆర్భాటం, దూకుడు ఆ తర్వాత జరిగే విచారణలో ఎందుకు కనిపించడం లేదు? పట్టుబడినప్పుడు కొండంతగా చూపించే ఆస్తుల విలువ.. విచారణ తుది దశకు వచ్చేసరికి పిసరంతగా ఎలా మారిపోతోంది? ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సామాన్య ప్రజల్లో, మేధావుల్లో వ్యక్తమవుతున్న ప్రధాన సందేహమిదే. దాడుల ప్రకటనల వరకే పరిమితమవుతున్న ఏసీబీ.. విచారణల ఆధారాలను కోర్టుకు సమర్పించడంలో తీవ్ర జాప్యం చేస్తోందనే తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఇప్పటివరకు ఏకంగా 512 కేసులు..

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఏసీబీ అధికారులు

మిగతా 3వ పేజీలో..

రేవంత్–కేటీఆర్ గ్లోబరీనా వార్..

- ముదిరిన మాటల యుద్ధం
- గ్లోబరీనా వ్యవహారంపై అధికార–ప్రతిపక్షాల మధ్య వాగ్వాదం
- పరస్పర ఆరోపణలు, సవాళ్లతో వేడెక్కిన రాజకీయాలు

2

- ఫిర్యాదు చేస్తే విచారణకు సిద్ధమన్న ముఖ్యమంత్రి
- పరువు నష్టం నోటీసు పంపినట్లు వెల్లడించిన కేటీఆర్
- లై డిటెక్టర్ పరీక్షకు రావాలంటూ సవాల్

'గ్లోబరీనాతో మాకు సంబంధం లేదు.. దమ్ముంటే విచారణ జరిపించాలి'

- గ్లోబరీనా ఆరోపణలపై ముఖ్యమంత్రికి పరువు నష్టం నోటీసు

2

- లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధమంటూ రేవంత్‌కు సవాల్
- కాంగ్రెస్, బీజేపీపై ఘాటు విమర్శలు
- సింగరేణి, కాంట్రాక్టుల వ్యవహారాలపై ఆరోపణలు

గ్లోబరీనా ముమ్మాటికీ కేటీఆర్ బినామీ సంస్థ

గ్లోబరీనా తప్పిదాలకు కెటిఆర్ క్షమాపణలు చెప్పాలి

ధర్మేంద్ర రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయదు

'సర్' ప్రక్రియలో ఎస్సీ, ఎస్టీ ఓట్లు తొలగించే కుట్ర

అందుకే అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నాం

మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

2

సెలవు పెట్టినందుకు ఉద్యోగం నుంచి తొలగింపు

- టెక్ మహింద్రా సంస్థపై ఉద్యోగిని ఫిర్యాదు

హైదరాబాద్, జూలై 23:

ప్రముఖ ఐటీ సంస్థ టెక్ మహీంద్రాపై మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని భావన దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనారోగ్యం కారణంగా తాను, అనంతరం తన చిన్నారి

మిగతా 2వ పేజీలో..

గ్రేటర్ ఎన్నికలకు హైకోర్టు బ్రేక్

- జీహెచ్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్‌పై తాత్కాలిక స్టే.. వార్డుల పునర్విభజనపై కోర్టు ఆదేశాలు

3

- జీహెచ్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు తాత్కాలిక స్టే
- రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి కోర్టు కీలక ఆదేశాలు

రేవంత్–కేటీఆర్ గ్లోబరీనా వార్..

హైదరాబాద్, జూలై 23, సిరి న్యూస్:

గ్లోబరీనా సంస్థ వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్య ఈ అంశంపై మాటల యుద్ధం ముదిరింది. పరస్పరం ఒకరిపై ఒకరు ఆరోపణలు, సవాళ్లు విసురుకోవడంతో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.

ఫిర్యాదు చేస్తే సమగ్ర విచారణ

గ్లోబరీనా వ్యవహారంపై కేటీఆర్ అధికారికంగా సీసీఎస్‌లో ఫిర్యాదు చేస్తే పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం నేరుగా చర్యలు తీసుకుంటే దానిని రాజకీయ కక్షసాధింపుగా ప్రచారం చేసే అవకాశం ఉంటుందని అన్నారు. జన్వాడ భూముల వ్యవహారం, గ్లోబరీనా అంశాల మధ్య సంబంధాలపై కూడా విచారణ జరిపిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్‌పై విమర్శలు చేస్తూ పలు వ్యాఖ్యలు చేశారు.

కేటీఆర్ ఎదురుదాడి

ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు స్పందించిన కేటీఆర్, ఇప్పటికే పరువు నష్టం నోటీసు పంపినట్లు వెల్లడించారు. సమాధానం రాకపోతే కోర్టులోనే న్యాయపోరాటం చేస్తానని స్పష్టం చేశారు. గ్లోబరీనా సంస్థ తనదేనని ఆరోపిస్తే, అదే సంస్థతో ప్రస్తుత ప్రభుత్వం ఎందుకు ఒప్పందం చేసుకుందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే విచారణ జరిపించాలని, అవసరమైతే తామిద్దరం లై డిటెక్టర్ పరీక్షకు కూడా సిద్ధమని సవాల్ విసిరారు. మరింత వేడెక్కిన రాజకీయ వాతావరణం గ్లోబరీనా వ్యవహారంతో పాటు ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈరేస్ వంటి అంశాలపై కూడా ఎలాంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నానని కేటీఆర్ ప్రకటించారు. ఈ అంశాల్లో కేసులు నమోదు చేసినా ఎదుర్కొనేందుకు వెనుకాడబోనని పేర్కొన్నారు. గ్లోబరీనా వివాదం చుట్టూ అధికార, ప్రతిపక్షాల మధ్య ఆరోపణలు మరింత తీవ్రమవుతుండటంతో తెలంగాణ రాజకీయాల్లో ఈ అంశం రానున్న రోజుల్లో మరింత ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం కనిపిస్తోంది.

గ్లోబరీనా ముమ్మాటికీ కేటీఆర్ బినామీ సంస్థ

- **ఆ సంస్థ తప్పిదాల వల్ల 27 మంది బలి**
- **పేరు మార్చుకుని పరీక్షల కాంట్రాక్ట్ పొందింది**
- **గ్లోబరీనా తప్పిదాలకు కెటిఆర్ క్షమాపణలు చెప్పాలి**
- **ధర్మేంద్ర రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయదు**
- **'సర్' ప్రక్రియలో ఎస్సీ, ఎస్టీ ఓట్లు తొలగించే కుట్ర**
- **అందుకే అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నాం**
- **మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, జూలై 23, సిరి న్యూస్:

గ్లోబరీనా ముమ్మాటికీ కేటీఆర్ బినామీ సంస్థ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోమారు ఆరోపించారు. గురువారం మీడియాతో చిట్‌చాట్ మాట్లాడుతూ గ్లోబరీనా తప్పిదాల వల్ల 27 మంది చనిపోయారని, ఆ సంస్థ పేరు మార్చుకొని పరీక్షల కాంట్రాక్టు పొందిందని, వీటి ఆధారంగానే నీట్ కుంభకోణం జరిగిందని ఆరోపించారు. గ్లోబరీనా తప్పిదాలపై కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమరవీరుల స్తూపం వద్ద కేటీఆర్ ముక్కు నేలకు రాయాలన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విషయంలో బీఆర్ఎస్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత కేటీఆర్, బీజేపీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేటీఆర్ బర్త్‌డే పై సీఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'కేటీఆర్ పుట్టిన రోజు దావత్ ఇస్తాడో లేదో అడగాలి. కేటీఆర్ ఇచ్చే దావత్ నేను తీసుకోలేనేమో. ఆయనవి అన్నీ వేరే పార్టీలు' అంటూ సెటైర్ వేశారు. హరీష్ గొప్పవాడైతే మంత్రి పదవి నుంచి ఎందుకు తీసేశారని ప్రశ్నించారు. అతి తెలివి తేటలతో ఏదిపడితే అది మాట్లాడతానంటే నడవదని హరీష్‌పై అగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు కన్నెపెల్లి పంపు హౌజ్ గురించి మాట్లాడుతున్నారని, మేడిగడ్డ గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. మేడిగడ్డ కట్టింది, కూల్చింది బీఆర్ఎస్ వాళ్లే అని వ్యాఖ్యానించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అయిపోయే వరకూ ఎమ్మెల్యేలను గ్రామాల్లోనే ఉండమని చెప్పానని ముఖ్యమంత్రి అన్నారు. 'సర్' నాయకులకు సంబంధించింది కాదని, ప్రజలకు సంబంధించిందని స్పష్టం చేశారు. 'తెలిసీ తెలియక నాకు రెండు ఓట్లు ఉన్నాయని అంటున్నారు. కలెక్టర్ అనుమతి తీసుకొని నా గ్రామంలో ఉన్న ఓటును కొడంగల్‌కు మార్చుకున్నాను. గతంలో కొడంగల్ ప్రాంతం కర్ణాటకలోని జిల్లాలో ఉండేది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు చేసినప్పుడు కొడంగల్ పాలమూరులోకి వచ్చిందని చెప్పారు. బీజేపీ కుట్రపూరితంగా ఓట్లను తొలగించే అవకాశముందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. గ్రామీణ ప్రాంతంలో అమాయకుల ఓట్లు పోయే అవకాశముందన్నారు. 'సర్' ఉద్దేశం ప్రక్షాళన అని.. దానిని కుట్ర పూరితంగా వాడుతున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు పోతే కాంగ్రెస్ ఓట్లు పోయినట్టే అన్నారు. అవగాహన లేకపోవడం, సరైన సమయంలో స్పందించకపోవడం వల్ల ఓట్లు పోయే అవకాశముందన్నారు. ఓటు హక్కు లేకపోతే ఆధార్ పోతుంది.. ఓటు హక్కు లేకపోతే గుర్తింపే ఉండదు..ఓటు హక్కు లేకపోతే సంక్షేమం రాదు' అని అన్నారు.

బీజేపీలో అంతర్గత కలహాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీ నాయకులకు ఒకరంటే ఒకరికి పడదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు ఎక్కడుంటాయో బీజేపీకి తెలుసని వెల్లడించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు 5 లక్షలు ఇవ్వాలని డిసైడ్ అయిందని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు.. బ్రోకర్లకు అమ్ముకొని దళారీ వ్యవస్థ తెచ్చారని మండిపడ్డారు. మేం ఏం చేస్తున్నామో అదే చెప్తున్నాం అని రేవంత్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 70 శాతం ఎస్ఐఆర్ పూర్తయిందని తెలిపారు. ప్రక్షాళన పేరుతో ఓట్లు తొలగించే అవకాశం ఉందని.. అలా జరగకుండా ఉండేందుకు బీఎల్‌వోలను పెట్టామన్నారు. ఓట్లు లేకుంటే ప్రభుత్వ పథకాలు ఎలా వస్తాయని సీఎం ప్రశ్నించారు. గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న ఆంధ్ర ఓట్లన్నీ తొలగించారు. కాంగ్రెస్ పార్టీ కోర్టుకు వెళితే జీహెచ్ఎంసీ కమిషనర్‌పై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. పేదలకు ఇచ్చే ఇళ్లను బీఆర్ఎస్ నేతలు దళారులకు అమ్ముకున్నారు. జన్వాడ ఫాంహౌస్ భూములపై కేటీఆర్ విచారణ కోరాలి. మేం అధికారంలోకి వచ్చాకే ఇందిరాపార్కు వద్ద ధర్నా చౌక్‌ను తిరిగి ఓపెన్ చేశాం. నాడు వాళ్లు మూసిన ధర్నా చౌక్‌లోనే కేటీఆర్ ధర్నా చేస్తామంటున్నారని రేవంత్ వ్యాఖ్యానించారు.

పేరు మార్చుకున్న గ్లోబరీనా..

ఆ సంస్థ నిర్మించిన ఫామ్‌హౌజ్‌లోనే కెటిఆర్

సిఓఇఎంటి సంస్థ తెలంగాణలోనే పుట్టిందని, ఆ సంస్థతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సంబంధాలున్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ ఆరోపించారు. ఆ సంస్థ నిర్మించిన ఫామ్‌హౌస్‌లోనే కేటీఆర్ ఉంటున్నారని, సంస్థకు సంబంధించిన భూములు కూడా ఆయన వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. 2019లో ఇంటర్ పరీక్షల నిర్వహణకు గ్లోబరీనా సంస్థకు అక్రమంగా టెండర్లు కేటాయించారని, ఆ సంస్థపై జేఎన్‌టీయూ హైదరాబాద్, జేఎన్‌టీయూ కాకినాడలో కేసులు నమోదైనా చర్యలు తీసుకోలేదన్నారు. 26 మంది విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన వ్యవస్థపై అప్పటి ప్రభుత్వం స్పందించలేదని, దీనిపై కేటీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు ఆయనకు లేదని, వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ధర్నా చేస్తున్న విద్యార్థులపై జరిగిన దాడిని బీఆర్ఎస్ ఖండించలేదని, బీజేపీని ప్రశ్నించే ధైర్యం కూడా ఆ పార్టీకి లేదని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో కేటీఆర్ మహాధర్నా చేపట్టడం సిగ్గుచేటని విమర్శించారు. శాంతియుతంగా నిరసనలు చేపడితే ప్రభుత్వం ఎలాంటి అడ్డంకులు సృష్టించదని, కానీ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే మాత్రం చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కొత్త పేరుతో మరో సంస్థను ఏర్పాటు చేసి సీబీఎస్ఈతో కూడా వ్యవహరిస్తోందని వెంకట్ ఆరోపించారు. ఇప్పుడు విద్యార్థుల కోసం పోరాడుతున్నట్లు కేటీఆర్ మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కూడా కేటీఆర్ ప్రమేయంపై అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో పేపర్ లీకేజీలు ఎక్కువగా జరిగాయని విమర్శించారు. ఇదిలా ఉంటే.. కేటీఆర్ తన పుట్టిన రోజు కోసం పది రోజుల ముందే దుబాయ్ వెళ్లారని, అక్కడ సినీ పరిశ్రమకు చెందిన కొందరితో కలిసి పార్టీ జరుపుకున్నారన్నారు. దుబాయ్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత మూడు రోజుల పాటు పూర్తిగా రెస్ట్ మోడ్‌లో ఉన్నారని, ఆ తర్వాత ఒక్కసారిగా విద్యార్థుల ధర్నా పేరుతో డ్రామా ప్రారంభించారని బల్మూరి విమర్శించారు.

దేశంలో అలజడులకు కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీల కుట్ర

- **బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు**

హైదరాబాద్, జూలై 23, సిరి న్యూస్ :

దేశంలో అశాంతిని సృష్టించి యువతను రెచ్చగొట్టడం ద్వారా మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని దెబ్బతీయడానికి కాంగ్రెస్, వామపక్షాలు, విదేశీ విచ్ఛిన్నకర శక్తులు పెద్ద ఎత్తున కుట్ర పన్నుతున్నాయని బీజేపీ¾ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు తీవ్రంగా మండిపడ్డారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ తరహాలోభారత దేశంలో కూడా అశాంతిని, హింసను సృష్టించేందుకు కొన్ని అల్ట్రాలెఫ్ట్, సాఫ్ట్‌లెఫ్ట్ శక్తులు, ఎసఎఫఐ, ఏఐఎసఏఫ్, ఏఎసవే వంటి పాత సంఘాల నాయకులు కొత్త పేర్లతో కాక్రోచ్ జనతా పార్టీ వంటి వేదికలను ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. పలుచోట్ల జరిగిన కార్యక్రమాల వెనుక ఈ శక్తుల హస్తం ఉందన్నారు. ఈ ఉద్యమాలకు ఖలిస్తాన్ శక్తుల నుంచి రూ.10 కోట్లు, కతార్, కెనడా, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుంచి ఆర్థిక, వ్యూహాత్మక మద్దతు అందుతోందని ఆరోపించారు. ఏ ఖలిస్తానీ శక్తులైతే రాహుల్ గాంధీ నానమ్మను పొట్టనబెట్టుకున్నాయో అదే శక్తులతో రాహుల్ గాంధీ జతకట్టడం సిగ్గుచేటని విమర్శించారు.'నీట' మోదీ ప్రభుత్వ పారదర్శక చర్యలు'నీట' పేపర్ లీకేజీపై రామచందర్‌రావు మాట్లాడుతూ లీకేజీ విషయం తెలిసిన వెంటనే ప్రభుత్వం తక్షణమే స్పందించి 31 మందిని అరెస్టు చేసిందని గుర్తు చేశారు. మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల్లో కాంగ్రెస్ అనుకూల వ్యక్తులే ఈ లీకేజీకి కారణమని తేలిందన్నారు. విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రభుత్వం రీఎగ్జామ్ నిర్వహించిందని, ఏ ఒక్క విద్యార్థి కూడా దీనిపై రోడ్డు మీదకొచ్చి నిరసన తెలపలేదని ఆయన అన్నారు. గతంలో పరీక్షల పేపర్ లీక్ అయితే 420 కేసులు పెట్టి వదిలేసేవారని, కానీ మోదీ ప్రభుత్వం 2024లో ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్ ఇన్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్ తీసుకొచ్చి రూ.కోటి జరిమానాతోపాటు కఠిన శిక్షలు అమలులోకి తెచ్చిందని చెప్పారు. ప్రొఫెసర్ రాధాకృష్ణన్ నేతృత్వంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)ని బలోపేతం చేసి సంస్కరణలు అమలు చేస్తోందని తెలిపారు.య□పీఏ పాలనలోనే రికార్డు స్థాయి లీకేజీలువిద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్ శక్తులు తమ గత చరిత్రను గుర్తు చేసుకోవాలని రామచందర్‌రావు హితవు పలికారు. 2014కు ముందు యూపీఏ ప్రభుత్వ హయాంలోనూ, కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు(టీఎంసి, డీఎంకే, ఎస్పీ, బీఆరఎస్ మొదలైనవి) పాలించిన రాష్ట్రాల్లో సుమారు 53కంటే ఎక్కువ ప్రధాన పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయని వివరించారు.

2005 నుండి 2014 వరకు సీబీఏసఈ, ఎయిమ్స్, ఆరఆర్‌బీ, ఎసఎస్సీ, బ్యాంకింగ్ వంటి అనేక జాతీయస్థాయి పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయని ఆధారాలు చూపారు. ఆ సమయంలో ఏనాడైనా కాంగ్రెస్ లేదా నాన్‌బీజేపీ ప్రభుత్వాల విద్యాశాఖ మంత్రులు రాజీనామాలు చేశారా అని ఆయన ప్రశ్నించారు. ఉద్యోగాలు, ఉపాధి కల్పనలో ఎన్డీయే కొత్త చరిత్ర20042014 మధ్య య□పీ¾ఏ ప్రభుత్వం 2.9 కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తే 20142024 మధ్య మోదీ ప్రభుత్వం 17 కోట్ల ఉద్యోగ అవకాశాలను సృష్టించిందన్నారు. ఎన్డీయే పాలనలో ఇప్పటివరకు 12 లక్షలకు పైగా నియామక పత్రాలు అందజేశామని, 19 రోజ్‌గార్ మేళాల ద్వారా నిరంతరం నియామకాలు జరుగుతున్నాయని రామచందర్‌రావు తెలిపారు. 201718లో 6%గా ఉన్న నిరుద్యోగిత రేటు 2025 నాటికి 3.1%కి తగ్గిందని, ఎంప్లాయ్‌మెంట్ రేటు 46.8% నుండి 57.4%కి పెరిగిందని వెల్లడించారు. 2014 తర్వాత ఐఐటీ, ఐఐఎమ్, ఎయిమ్స్, ఎనఐటీ, మెడికల్ కళాశాలల సంఖ్యను రెట్టింపు చేశామని, ఉన్నత విద్యలో విద్యార్థుల నమోదు 4.5 కోట్లకు పైగా పెరిగిందని వివరించారు. వికసిత్ భారత్, ముద్ర యోజన, స్టార్టప్ ఇండియా ద్వారా కోట్లాది మంది యువతకు స్వయం ఉపాధి లభించిందన్నారు.

'గ్లోబరీనాతో మాకు సంబంధం లేదు.. దమ్ముంటే విచారణ జరిపించాలి' : కేటీఆర్

- **గ్లోబరీనా ఆరోపణలపై ముఖ్యమంత్రికి పరువు నష్టం నోటీసు**
- **లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధమంటూ రేవంత్‌కు సవాల్**
- **కాంగ్రెస్, బీజేపీపై ఘాటు విమర్శలు**
- **సింగరేణి, కాంట్రాక్టుల వ్యవహారాలపై ఆరోపణలు**
- **జిల్లాల నుంచి రాజకీయ కార్యాచరణ ప్రారంభిస్తామని ప్రకటన**

వరంగల్, జూలై 23, సిరి న్యూస్

"గ్లోబరీనా సంస్థతో మాకు ఎలాంటి సంబంధం లేదు. దమ్ముంటే వెంటనే విచారణ జరిపించాలి. అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి లై డిటెక్టర్ పరీక్షకు కూడా సిద్ధమే" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వరంగల్‌లో నిర్వహించిన చిట్‌చాట్ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, గ్లోబరీనా వ్యవహారంపై తనపై చేసిన ఆరోపణలకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇప్పటికే పరువు నష్టం నోటీసు పంపినట్లు వెల్లడించారు. నోటీసుకు తగిన సమాధానం ఇవ్వకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

విచారణకు సిద్ధమని స్పష్టీకరణ

గ్లోబరీనా సంస్థ తనదేనని ఆరోపిస్తే, అదే సంస్థతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఒప్పందం చేసుకుందో ప్రజలకు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ, దర్యాప్తుకు పూర్తిగా సహకరిస్తానని తెలిపారు. గ్లోబరీనా, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈరేస్ వంటి ఏ అంశంపైనా విచారణకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

రేవంత్, బీజేపీపై విమర్శలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీజేపీపై విమర్శలు చేయడానికి వెనుకాడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. పాత కేసుల భయంతోనే బీజేపీ నాయకత్వంపై స్పందించడం లేదని అన్నారు. సింగరేణిలో జరుగుతున్న అక్రమాలపై కూడా బీజేపీ మౌనం పాటిస్తోందని విమర్శించారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో బీఆర్ఎస్ రాజీపడదని స్పష్టం చేశారు.

రాజకీయ కార్యాచరణపై సంకేతాలు

రేవంత్ రెడ్డి కుటుంబానికి సంబంధించిన కాంట్రాక్టులపై కూడా కేటీఆర్ ఆరోపణలు చేశారు. గ్లోబరీనా సంస్థ తనదేనని నిరూపిస్తే రాహుల్ గాంధీతో కలిసి తన నివాసం ముందు ధర్నా చేయాలని సవాల్ విసిరారు. త్వరలో జిల్లాల నుంచే పార్టీ రాజకీయ కార్యక్రమాలను ప్రారంభించి, అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని ముందుకు సాగుతామని వెల్లడించారు.

మహానగరం మధ్యన పేదోడికి ఇల్లు ఉండొద్దా?

హైదరాబాద్, జూలై 23, సిరి న్యూస్ :

హైదరాబాద్ మహానగరం నడిబొడ్డున పేదలకు గౌరవప్రదమైన సొంతింటిని అందించాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పాన్ని చూసి బీఆర్ఎస్ నాయకత్వం తీవ్ర అసహనానికి గురవుతోందని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. నిరుపేదలు నివసిస్తున్న ప్రాంతంలోనే వారి సొంతింటి కలను నెరవేర్చడానికి నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. వీటి కోసం స్థానికంగా ఉన్న మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని, మీసేవ వాట్సాప్ నెంబరు 8096958096, వెబ్‌సైట్ (ఎవవసవజa.tవశ్రీaఅస్త్రaఅa.స్రశీజ.అఅ) ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లు, దరఖాస్తులు తదితర అంశాలపై అధికారులతో గురువారం సమీక్షించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పదేళ్ల పాలనలో వారు చేయలేని పనిని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే ప్రజలను తప్పుదోవ పట్టించేలా విష ప్రచారాలతో రాజకీయ లబ్ధిపొందాలని బీఆర్ఎస్ యత్నిస్తోందని ఆరోపించారు. నగరంలోనే పుట్టి పెరిగి అక్కడే జీవిస్తున్న నిరుపేద కుటుంబాలకు నగర నడిబొడ్డులో సొంతింటిని సమకూర్చాల్సిన బాధ్యతను గత ప్రభుత్వం విస్మరించి వారిని నగరానికి దూరంగా నెట్టివేసిందన్నారు. ఉద్యోగాలు, ఉపాధి, పిల్లల చదువులు, వైద్య సౌకర్యాలకు 3040 కి.మీ దూరంలో కనీస వసతులు కల్పించకుండా అరకొరగా ఇళ్లను నిర్మించి అదే పేదల సంక్షేమమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజా ప్రభుత్వం పేదోడు కూడా హైదరాబాద్ నడిబొడ్డులో గౌరవంగా జీవించాలనే భావనతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను చేపట్టిందని తెలిపారు. ప్రభుత్వ భూములను ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తూ పేదలకు శాశ్వత భరోసా కల్పించే చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంటే దానిపైనా విషప్రచారం చేస్తోందని మండిపడ్డారు. నగరంలో అత్యంత విలువైన ప్రభుత్వ భూములలో పేదలకు ఇళ్లు నిర్మించకూడదా.. ప్రభుత్వ భూములు కొద్దిమంది కోసం మాత్రమేనా.. పేదల కోసం వినియోగిస్తే ఎందుకింత కడుపుమంట అని ప్రశ్నించారు. పేదోడిపై తుపాకి పెట్టి రాజకీయాలు చేయాలనుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు. బీఆరఎస్ విష ప్రచారాలను, కపట నాటకాలను మహానగర ప్రజలు గమనించాలని, పేదల సంక్షేమాన్ని అడ్డుకునే రాజకీయాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

ఇందిరమ్మ టవర్స్‌పై బీఆర్ఎస్ దుష్ప్రచారం

గతంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇందిరమ్మ టవర్స్‌గా మార్చి విక్రయిస్తారన్న ప్రచారం అవాస్తవమన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మార్గదర్శకాల ప్రకారమే ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తామని, లబ్ధిదారుల మీద ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ ఇస్తోందని తెలిపారు. ఇది అమ్మకం కాదు.. ప్రభుత్వ ఆర్థిక సహకారం. లబ్ధిదారుడి వాటా అన్ని ప్రాంతాల్లో రూ.6 లక్షలు మాత్రమే. ఫ్లాట్ల మార్కెట్ విలువ తొలి విడతలో ప్రారంభించనున్న 16 నియోజకవర్గాల్లో రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉందన్నారు. ఎసఆర్‌వో(బేసిక్) విలువ రూ.14.6 లక్షల నుంచి రూ.28.4 లక్షల వరకు ఉందని చెప్పారు. దీంతో ప్రభుత్వం అందించే సబ్సిడీ, భూమి విలువ, నిర్మాణ వ్యయాన్ని కలిపి పేదలకు అత్యంత తక్కువ ధరలో గృహాలను అందించే అవకాశం కల్పిస్తోందన్నారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా ప్రయోగాత్మకంగా నిర్మించే ఇళ్లలో యాజమాన్య హక్కులకు సంబంధించి ఎస్సీలకు 14, ఎస్టీలకు 5, బీసీలకు 16, దివ్యాంగులకు 5, ప్రభుత్వ అవుట్ సోర్సింగ్, 4వ తరగతి ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు 10 శాతం చొప్పున రిజర్వేషన్ కల్పిస్తున్నామని వివరించారు. ఇందులోనూ 30 శాతం మహిళలకే కేటాయిస్తున్నామని, మిగతా 50 శాతం జనరల్ కేటగిరీలో కేటాయిస్తామని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలపై బీఆరఎస్‌కు, ఆ పార్టీలోని దొరలకు ఏ మాత్రం అభిమానం, ప్రేమ ఉన్నా విష ప్రచారాన్ని మానుకుంటారని ఆశిస్తున్నానన్నారు. ఈ విష ప్రచారాన్ని కొనసాగిస్తే జూబ్లీహిల్స్, కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో పట్టిన గతే రాష్ట్రవ్యాప్తంగా పడుతుందని మంత్రి పొంగులేటి హెచ్చరించారు.

సెలవు పెట్టినందుకు ఉద్యోగం నుంచి తొలగింపు

మొదటిపేజీ తరువాయి

ఆరోగ్యం బాగోలేక సెలవులు తీసుకున్నపథ్యంలో ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా సంస్థ ఉద్యోగం నుంచి తొలగించిందని ఆమె ఆరోపించారు.భావనతెలిపినవివరాలప్రకారం, అనారోగ్యంతో 13రోజులపాటు సెలవులో ఉన్న సమయంలో, అలాగే తన కుమార్తె అనారోగ్యం కారణంగా మరికొన్ని రోజులు సెలవు తీసుకున్నప్పటికీ, యాజమాన్యం ఈమెయిల్‌ల ద్వారా వెంటనే విధులకు హాజరు కావాలని ఒత్తిడి తెచ్చిందని పేర్కొన్నారు. వ్యక్తిగత పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా వేధింపులకు గురి చేశారని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా, కార్యాలయంలో వాష్‌రూమ్‌కు వెళ్లాలన్నా అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేదని, ఉద్యోగులపై అత్యంత కఠినమైన నిబంధనలు అమలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. మహిళా ఉద్యోగులకు కుటుంబ బాధ్యతలు, చిన్నారుల సంరక్షణ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఐటీ సంస్థలు మరింత మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. భావన ఫిర్యాదును స్వీకరించిన దుండిగల్ పోలీసులు ఘటనకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తున్నారు. ఈ ఆరోపణలపై టెక్ మహీంద్రా యాజమాన్యం నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది.

పోటీ ప్రపంచంలో సింగరేణి నిలదొక్కుకోవాలి

సత్తుపల్లి, జూలై 23, సిరి న్యూస్:

పోటీ ప్రపంచంలో సింగరేణి క్యాలరీస్ సంస్థను సమర్థవంతంగా నిర్వహిస్తూ, వ్యాపార విస్తరణ ద్వారా భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి తెలంగాణకు ఆత్మలాంటిది.. కార్మికులు, ప్రజలతో 130 ఏళ్ల చరిత్రకలిగిన సింగరేణితో భావోద్వేగ అనుబంధం ఉందని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అన్నారు. ఈ ప్రభుత్వ రంగ సంస్థను కాపాడుకోవడమే కాకుండా, రాబోయే తరాలకు లాభదాయకంగా అందించడం మన అందరి బాధ్యత అని ఆయన అన్నారు. సత్తుపల్లిలోని సింగరేణి ఓపెన్ కాస్ట్ బొగ్గుగనిని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరిశీలించారు. గనిలో బొగ్గు లభ్యత, పరిమాణం, బొగ్గు క్వాలటీని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటుగాఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, జెన్ కోసీఎండీ హరీష్, సింగరేణి డైరెక్టర్ గౌతమ్ పోట్రూ, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, మాలోత్ రాందాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ.. మైనింగ్ నిర్వహణలో పాటిస్తున్న పద్ధతులు, ఎదురవుతున్న సవాళ్లు, భవిష్యత్తు ప్రణాళికలను ప్రత్యక్షంగా చూడటానికే క్షేత్ర స్థాయి పరిశీలనకు వచ్చినట్లు చెప్పారు. ఓవర్ బర్డెన్ అనేది మైనింగ్ లో బయటకు తీసే మట్టి, రాతి వ్యర్థం. బొగ్గు అనేది సింగరేణికి ప్రధాన రాబడి తెచ్చే అత్యంత విలువైన వనరుగా ఆయన

చెప్పారు. కాంట్రాక్టర్లకు మట్టి తీసినా వాల్యూమ్ ప్రకారమే బిల్లులు వస్తాయి కాబట్టి వారి దృష్టిలో రెండూ ఒక్కటే అనిపించవచ్చు. సింగరేణి యాజమాన్యానికి మాత్రం ఓవర్ బర్డెన్, బొగ్గు మధ్య ఉన్న వ్యత్యాసం చాలా స్పష్టంగా తెలిసి ఉండాలన్నారు. ఫేస్ వద్ద బ్లాస్టింగ్ జరిపి, లోడింగ్ చేసే సమయంలో బొగ్గులో ఓవర్ బర్డెన్ మట్టి, రాళ్ళు కలవకుండా చూడాలన్నారు. ప్రతీ షావల్ దగ్గర, ప్రతీ లోడింగ్ పాయింట్ దగ్గర మన అధికారులు ఉండి కంటిన్యూయస్ మానిటరింగ్ చేయాలన్నారు. నాణ్యత లేని బొగ్గును రవాణా చేయడం వల్ల అనవసరమైన ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు పెరగడమే కాకుండా, థర్మల్ పవర్ ప్లాంట్లలో ప్రొడక్షన్ తగ్గిపోయి ట్రిప్ అవుతాయని అన్నారు. కల్తీ లేని నాణ్యమైన బొగ్గును మాత్రమే జెన్ కోకు ఇతర కస్టమర్లకు సరఫరా చేయాలని అధికారులకు సూచనలు చేశారు. ఒకప్పుడు బొగ్గు రంగంలో ఏకఛత్రాధిపత్యం ఉండేది. ఈ రోజు పరిస్థితి మారిందని అన్నారు. మార్కెట్‌లో ప్రైవేటు సంస్థలు పోటీకి వస్తున్నాయి. విదేశాల నుంచి 'ఇంపోర్టెడ్ కోల' వస్తోందన్నారు. ఈ కాంపిటీటివ్ మార్కెట్ లో సింగరేణి నిలబడాలంటే అత్యంత నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేయలని అన్నారు. అంతేకాక బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గించడం ముఖ్యమని అన్నారు. గత పదేళ్ల కాలంలో కొత్త కోల్ బ్లాక్స్ వేలంలో సింగరేణి పాల్గొనకపోవడం వల్ల చాలా అవకాశాలను కోల్పోయామని చెపోయారు. ఒక కోల్ బ్లాక్ వేలంలో దక్కించుకుని, అక్కడ భూసేకరణ, అటవీ అనుమతులు సాధించి మైనింగ్ ప్రారంభించడానికి కనీసం 7 నుంచి 8 ఏళ్ల సమయం పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి కనీసం 10 ఏళ్ల ముందస్తు ప్రణాళికతో పని చేయాలని అన్నారు. రాబోయే పదేళ్లలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఎంత పెరుగుతుంది? దానికి ఎంత బొగ్గు అవసరం? అనే దానిపై సింగరేణి యాజమాన్యం - జెన్ కో యాజమాన్యం కలిసి కూర్చుని ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాడిచర్ల2, నైని వంటి బ్లాక్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, ఫారెస్ట్ అనుమతుల సమస్యలను వేగంగా పరిష్కరించామని అన్నారు. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా జరిగే నూతన కోల్ బ్లాక్స్ వేలంలో సింగరేణి పాల్గొనేలా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. ప్రపంచం మొత్తం ఈ రోజు గ్రీన్ ఎనర్జీ వైపు వెళ్తోంది. సింగరేణి కూడా కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా సోలార్ ఎనర్జీ రంగంలోకి వేగంగా అడుగులు వేయాలన్నారు. భవిష్యత్తులో థర్మల్ పవర్‌కు ప్రత్యామ్నాయంగా సోలార్, పంప్డ్ స్టోరేజ్, హైడ్రోజన్, న్యూక్లియర్ ఎనర్జీ వాడకం పెరుగుతుందని అన్నారు. దీనికి అనుగుణంగా సింగరేణి సోలార్ పవర్ ఉత్పత్తిపై మరింత దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. మైనింగ్ రంగంలో సింగరేణి సంస్థకున్న అపారమైన అనుభవం, నిపుణులైన సాంకేతిక శక్తి కేవలం బొగ్గుకే పరిమితం కాకూడదన్నారు. సెమీకండక్టర్లు, చిప్ తయారీకి అవసరమైన క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ మినరల్స్ అన్వేషణ, మైనింగ్ ప్రక్రియలోకి సింగరేణి ప్రవేశించాలని పిలుపునిచ్చారు. సింగరేణిని కాపాడుకుంటూ, లాభాల బాట పట్టిస్తూ, ప్రపంచస్థాయిలో నిలబెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి సహాయ సహకారాలైనా అందించడానికి సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం అన్నారు. అధికారులు, ఇంజనీర్లు, కార్మికులు సమన్వయంతో పనిచేసి సింగరేణి ప్రభను మరింతగా వెలిగించాలని భట్టి విక్రమార్క చెప్పారు.

దాడుల్లో ఉన్న దూకుడు విచారణలో లేదేం..?!

మొదటిపేజీ తరువాయి

అత్యంత వేగంగా స్పందిస్తూ ఇప్పటివరకు ఏకంగా 512 కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ అధికారిక లెక్కల ప్రకారమే అవినీతి అధికారులు రూ.1,300 కోట్లకు పైగా అక్రమాస్తులు సంపాదించినట్లు గుర్తించారు. అయితే వీటి ప్రస్తుత ఓపెన్ మార్కెట్ విలువ లెక్కగడితే ఏకంగా రూ .13వేల కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. సగటున ఒక చిన్న స్థాయి అధికారి దాడుల్లో పట్టుబడ్డా ఆయన ఆస్తి మార్కెట్ విలువ రూ.10 కోట్లకు తగ్గడం లేదు. ఒక ఉద్యోగి తన జీవితకాల సర్వీస్ పూర్తి చేసినా అందులో సగం కూడా న్యాయబద్ధంగా సంపాదించడం అసాధ్యం. అంతటి ఆధారాలు లభించినా, కేసులు ముందుకు సాగకపోవడం వెనుక అసలు మర్మమేంటో ఏసీబీ అధికారులే సమాధానం చెప్పాలి.

ఏసీబీ తీరుపైనా అనుమానాలు

2024లో 152 కేసులు నమోదు కాగా 223 మందిని, 2025లో 199 కేసుల్లో 273 మందిని అరెస్ట్ చేశారు. ఇక 2026 జులై నాటికే 87 మందిపై కేసులు నమోదయ్యాయి. కానీ, ఈ మూడేళ్ల కాలంలో అరెస్టయిన ఒక్క అధికారికి కూడా శిక్ష పడిన దాఖలాలు గానీ, అరెస్టయిన రోజు ప్రకటించిన ఆస్తుల విలువ కోర్టులో నిరూపితమైన ఆధారాలు గానీ లేకపోవడం ఏసీబీ పనితీరుపై మచ్చగా మారుతోంది. పెన్ డ్రైవ్‌లు, డైరీలు, బ్యాంక్ ఖాతాలు దొరికినా విచారణ ప్రక్రియ నిద్రపోతోంది. పైగా, అరెస్టయిన అధికారులు తమకున్న చట్టపరమైన వెసులుబాటుతో

రెండేళ్లలోనే మళ్లీ ఉద్యోగాల్లోకి చేరుతున్నారు. లంచగొండులకు లూటీ చేసుకునే కీలక పదవులను కేటాయించవద్దని నిబంధనలు ఉన్నా, మళ్లీ కాసులు కురిపించే పోస్టింగులే వారికి దక్కుతున్నాయి.

ఈ అవినీతిపరుల విచారణలో లెక్క తేలిందెంత?

గతంలో పట్టుబడ్డ అధికారుల ఆస్తుల చిట్టాను పరిశీలిస్తే విస్తుపోయే నిజాలు వెలుగుచూస్తున్నాయి. ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి రావు పట్టుబడినప్పుడు రూ.2.5 కోట్ల నగదు, రూ.200 కోట్ల పైచిలుకు ఆస్తులు గుర్తించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఇంజనీర్లు నూనె శ్రీధర్‌కు రూ.110 కోట్లు, భూక్యా హరిరాంకు రూ.120 కోట్లు, ఈఎన్సీ మురళీధర్ రావుకు రూ.200 కోట్ల ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ తేల్చింది. ఇక ఆర్ అండ్ బి ఈఎన్సీ మోహన్ నాయక్ రూ.170 కోట్లు, డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్ రూ.120 కోట్లు, హెచ్ఎమ్‌డీఏ మాజీ డైరెక్టర్ శివరామకృష్ణ రూ.200 కోట్లకు పైగా సంపాదించారు. ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ నీకేష్ కుమార్ రూ.150 కోట్లు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కిషన్ నాయక్ రూ.100 కోట్లు, ఇటీవలే పట్టుబడ్డ హెచ్ఎమ్‌డీఏ చీఫ్ ఇంజనీర్ బచ్చు రవీందర్ రూ.100 కోట్లకు పైగా ఆస్తులు ఆర్జించారు. వీరంతా వందల కోట్లు గడించిన వారే అయినా, ఏ ఒక్కరిపైనా ఇప్పటివరకు ఏసీబీ పూర్తిస్థాయి నివేదికను సమర్పించకపోవడం గమనార్హం.

అమాయకులను బలిచేస్తున్నారు..

మరోవైపు, ఏసీబీ వ్యవస్థలోని లోపాల వల్ల కొందరు నిజాయితీపరులైన అధికారులు కూడా బలిపశువులవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఫిర్యాదుదారుడి నేపథ్యాన్ని ముందస్తుగా విచారించకుండా ఏసీబీ దాడులు చేయడం వల్ల ఈ పరిస్థితి దాపురిస్తోంది. ఉదాహరణకు, సంగారెడ్డి జిల్లా బొల్లారం విద్యుత్ సెక్షన్ ఏఈగా పనిచేస్తున్న నిబద్ధత కలిగిన అధికారిపై.. నేర చరిత్ర ఉన్న ఒక వ్యక్తి కుట్రపూరితంగా ఏసీబీ ట్రాప్ చేయించాడు. కాంట్రాక్టర్‌కు డబ్బులు ఇవ్వమని చెప్పి, ముందస్తు ప్రణాళికతో ఏఈని కేసులో ఇరికించారు. ఫిర్యాదుదారుడిపై ముందే ప్రాథమిక విచారణ చేసి ఉంటే ఇలాంటి నీతిమంతుల జీవితాలు నాశనం కాకపోయేవి. పట్టుబడినప్పుడు రూ.వందల కోట్ల ఆస్తులు చూపిస్తూ సమాజానికి అవినీతిపై కొరడా ఝుళిపిస్తున్నట్లు కలరింగ్ ఇస్తున్న అధికారులు.. క్షేత్రస్థాయి విచారణకు వచ్చేసరికి నీరుగార్చేలా వ్యవహరిస్తున్నారు. అవినీతిని ఉపేక్షించేది లేదని ప్రభుత్వం చెప్తున్న మాటలు కేవలం దాడుల ప్రకటనల వరకే పరిమితమవుతున్నాయని, శిక్షలు పడనంత కాలం వ్యవస్థలో మార్పు రాదని ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

కీలక శాఖల్లో పేట్రేగుతున్న అవినీతి..

రాష్ట్రంలో పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, రిజిస్ట్రేషన్స్ వంటి అత్యంత ప్రజా ప్రాముఖ్యత కలిగిన శాఖల్లో అవినీతి ఏటికేడు అపరిమితంగా పెరిగిపోతోంది. ఏసీబీకి దొరుకుతున్న లంచగొండుల్లో అత్యధిక శాతం ఈ శాఖలకు చెందిన అధికారులే ఉండటం క్షేత్రస్థాయిలో ఉన్న తీవ్రమైన పరిస్థితులకు అద్దం పడుతోంది. దినచర్యలో భాగంగా ప్రజలు నిత్యం ఆశ్రయించే ఈ కీలక విభాగాల్లో ప్రతి చిన్న పనికీ అమ్యామ్యాలు చెల్లించుకోవాల్సి రావడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. కేవలం చిన్న స్థాయి అధికారులను ట్రాప్ చేయడంతో సరిపెట్టకుండా, ఈ శాఖల్లో పైస్థాయి నుండి కిందిస్థాయి వరకు వ్యాపించిన లంచగొండితనాన్ని మూలాల నుండి నిర్మూలించేలా ప్రభుత్వం స్పష్టమైన విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని, ప్రత్యేక పర్యవేక్షణా వ్యవస్థను ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచాలని ప్రజలు గట్టిగా కోరుతున్నారు.

ఏది నిజం..? ఎవరిది పాపం.. ఎవరికి శాపం?

తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:

భారతీయ పరిపాలనా వ్యవస్థలో అత్యంత కీలకమైన, బాధ్యతాయుతమైన ఇండియన్ పోలీస్ సర్వీస్ కు ఎంపికై, హైదరాబాద్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ట్రైనీ అధికారుల తీరు ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సమాజంలో శాంతిభద్రతలను కాపాడి, ప్రజలకు రక్షణగా నిలవాల్సిన అత్యున్నత స్థానాల్లోకి వెళ్లే తరుణంలో.. వృత్తిపై ధ్యాస పదిలి నీచమైన పనులకు, వెకిలి చేష్టలకు పాల్పడటం పోలీస్ వ్యవస్థకే మచ్చగా మారింది. ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకునే స్థాయికి సమస్య వెళ్లడం, తప్పుడు ఆరోపణలు భరించలేక ఒక ట్రైనీ అధికారి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టడం సామాన్య ప్రజలకు ఎలాంటి సందేశాన్ని ఇస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనపై సమగ్ర వాస్తవాలను వెలికితీసేందుకు ప్రభుత్వం ఒక ఉమెన్స్ వింగ్ డీసీపీ స్థాయి అధికారిని విచారణాధికారిగా నియమించింది.

కానిస్టేబుల్ నుండి ఐపీఎస్ వరకు.. తీరా ప్రేమ ముళ్లబాట

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఉదయ్ కృష్ణారెడ్డి సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించి, మొదట కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరాడు. అయితే విధినిర్వహణలో ఉన్నప్పుడు ఒక ఉన్నతాధికారి తనను అవమానించాడనే కసితో, ఎలాగైనా అత్యున్నత పదవి సాధించాలని పట్టుదలతో యూపీఎస్సీ పరీక్ష రాశాడు. నాలుగు పర్యాయాలు శ్రమించి దేశవ్యాప్తంగా 350వ ర్యాంక్ సాధించి ఐపీఎస్‌గా ఎంపికయ్యాడు. అంతటి కష్టపడే తత్వం ఉన్న వ్యక్తి, ఎన్‌పీఏలో శిక్షణ పొందుతున్న సమయంలో ఒక మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణితో ఏర్పడిన పరిచయం, ప్రేమ వ్యవహారం ఆయన కష్టపడి నిర్మించుకున్న గొప్ప కెరీర్‌ను పేకమేడలా కుప్పకూలేలా చేసింది.

మహిళా ట్రైనీ ఫిర్యాదుపై ఎన్నో అనుమానాలు

ఉదయ్ కృష్ణారెడ్డి తనను తీవ్రంగా వేధిస్తున్నాడని, తనను బలవంతంగా తన గదిలోకి లాక్కెళ్లాడని సదరు మహిళా ట్రైనీ అధికారిణి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో, అధికారులు తక్షణమే స్పందించి ఉదయ్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. ఈ హఠాత్పరిణామంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఉదయ్ కృష్ణారెడ్డి, తన బంధువుల ఇంట్లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అయితే ఆత్మహత్యకు ముందు ఆయన రాసిన ఒక లేఖ ఇప్పుడు ఈ కేసులో అనేక సంచలన నిజాలను వెలుగులోకి తెచ్చింది.

లేఖతో మలుపు తిరిగిన కేసు.. వెలుగులోకి సంచలనాలు..

తన లేఖలో ఉదయ్ కృష్ణారెడ్డి పేర్కొన్న విషయాలు కేసును సంపూర్ణంగా మలుపు తిప్పాయి. "ట్రైనింగ్ సమయంలో మేమిద్దరం ప్రేమించుకున్నాం. పెళ్లి కూడా చేసుకోవాలని భావించి, అన్ని రకాలుగా ఒక్కటయ్యాం. అయితే నాపై నిందలు వేస్తూ ఆమె మరొక ఐఏఎస్ అధికారితో వివాహానికి సిద్ధపడింది. పెళ్లి తర్వాత కూడా నాతో అదే సంబంధాన్ని కొనసాగించేందుకు ప్రయత్నించగా నేను నిరాకరించాను. దీంతో ఆమె తన భర్తకు ఫిర్యాదు చేసింది. ఆమె భర్త నన్ను ప్రశ్నించగా, మేమిద్దరం గతంలో సన్నిహితంగా ఉన్న వీడియో సాక్ష్యాన్ని పంపించాను. అది మనసులో పెట్టుకుని కక్షతో నాపై తప్పుడు వేధింపుల ఆరోపణలు చేసింది. గదిలోకి లాక్కెళ్లాననే మాట అవాస్తవం, దానికి సంబంధించిన దృశ్యాల ఆధారాలు కూడా నా వద్ద ఉన్నాయి" అని ఉదయ్ లేఖలో స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ వివరాలతో అధికారులు వీడియో సాక్ష్యాలను, అంతర్గత కోణాలను నిశితంగా పరిశీలిస్తున్నారు.

తీవ్రంగా పరిగణించిన ఎన్‌పీఏ అధికారులు!

దేశంలోనే అత్యుత్తమ శిక్షణా కేంద్రమైన హైదరాబాద్ నేషనల్ పోలీస్ అకాడమీలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం పట్ల ఎన్‌పీఏ ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. అత్యున్నత పదవులు చేపట్టబోయే అధికారులు వృత్తిపరమైన బాధ్యతలను పక్కనబెట్టి వ్యక్తిగత వికృత వ్యవహారాలను అకాడమీ ఆవరణలో నడపడం తీవ్ర క్రమశిక్షణా రాహిత్యమని భావిస్తున్నారు. ఈ వ్యవహారంలో తప్పు ఎవరిదైనా సరే, కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. సమాజంలో నిత్యం నేరాలు, అన్యాయాలు చూసి భయపడుతున్న సగటు ప్రజలకు.. చట్టాన్ని కాపాడే శిక్షణ ఇచ్చే కేంద్రాల్లోనే ఇలాంటి పర్యవేక్షణా లోపాలు, నైతిక విలువల పతనం కనిపించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మధ్యతరగతి, పేద ప్రజలు తమ పిల్లలను ప్రజాసేవ వ్యవస్థల్లోకి పంపడానికి సందేహించేలా ఈ ఘటన నిలిచిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గ్రేటర్ ఎన్నికలకు

హైకోర్టు బ్రేక్

- **జీహెచ్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్‌పై తాత్కాలిక స్టే.. వార్డుల పునర్విభజనపై కోర్టు ఆదేశాలు**
- **జీహెచ్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు తాత్కాలిక స్టే**
- **వార్డుల పునర్విభజన పూర్తయ్యే వరకు ఎన్నికల ప్రక్రియ నిలిపివేత**
- **రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి కోర్టు కీలక ఆదేశాలు**
- **వార్డుల విభజనపై పిటిషనర్ల అభ్యంతరాల పరిశీలన**
- **తాజా పరిణామాలతో రాజకీయ వర్గాల్లో చర్చ**

హైదరాబాద్, జూలై 23, సిరి న్యూస్

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల నిర్వహణకు సంబంధించి తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. వార్డుల పునర్విభజన ప్రక్రియను చట్టబద్ధంగా పూర్తి చేసి, సరిహద్దులను శాస్త్రీయంగా నిర్ణయించే వరకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ తాత్కాలిక స్టే విధించింది. దీంతో జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది.

వార్డుల పునర్విభజనపై అభ్యంతరాలు

జీహెచ్ఎంసీ వార్డుల పునర్విభజన ప్రక్రియలో నిబంధనలు పాటించలేదంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు, పిటిషనర్లు లేవనెత్తిన అంశాలను పరిశీలించింది. జనాభా ప్రాతిపదికన శాస్త్రీయంగా వార్డుల సరిహద్దులు నిర్ణయించాల్సి ఉండగా, ప్రస్తుత ప్రక్రియలో పలు లోపాలు ఉన్నాయని పిటిషన్లలో పేర్కొన్న విషయాలను కోర్టు పరిగణనలోకి తీసుకుంది.

రాజకీయంగా చర్చకు దారితీసిన పరిణామం

హైకోర్టు తాజా ఆదేశాలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు విమర్శలు గుప్పిస్తుండగా, ప్రభుత్వం చట్టపరమైన ప్రక్రియను అనుసరిస్తోందని అధికార వర్గాలు చెబుతున్నాయి. జీహెచ్ఎంసీ ఎన్నికల షెడ్యూల్‌పై ఈ పరిణామం ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ఎన్నికల నిర్వహణపై అనిశ్చితి

హైకోర్టు ఆదేశాల మేరకు వార్డుల పునర్విభజన ప్రక్రియను తిరిగి పూర్తి చేసిన అనంతరమే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ ప్రక్రియకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉండటంతో గ్రేటర్ ఎన్నికల నిర్వహణపై అనిశ్చితి నెలకొంది. తదుపరి విచారణలో హైకోర్టు ఇచ్చే ఆదేశాలపై ఎన్నికల ప్రక్రియ భవిష్యత్తు ఆధారపడి ఉండనుంది.

ప్రతీ విద్యార్థి నుంచి అభిప్రాయ సేకరణ

హైదరాబాద్, జూలై 23, సిరి న్యూస్:

యూనిఫాంలు పంపిణీ చేసిన తర్వాత వాటి నాణ్యత, సైజు ఇతర అంశాలపై ప్రతీ విద్యార్థి నుంచి వాట్సాప్ ద్వారా అభిప్రాయ సేకరణ (ఫీడ్ బ్యాక్) తీసుకుంటామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. దాని ఆధారంగా వచ్చే ఏడాది పంపిణీ, వాటి రంగులు ఇతర అంశాలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. విద్యార్థులకు యూనిఫాంల అందజేతపై ఎంసీఆర్‌హెచ్ఆర్డీలో గురువారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో చదివే విద్యార్థులకు అందజేసే యూనిఫాంల నాణ్యతలో రాజీపడమని స్పష్టం చేశారు. ఆగస్టు 15 నాటికి పిల్లలందరికీ యూనిఫాం అందజేయాల్సినదేనని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో అలసత్వం వహిస్తే సహించనని హెచ్చరించారు. మహిళా సంఘాలకు పని వేగవంతం చేసేలా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని సెర్ప్ సీఈవో దివ్యకు సీఎం సూచించారు.

గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు యూనిఫాంల అందజేతలో అడ్డగోలుగా వ్యవహరించారని సీఎం అన్నారు. తాము వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని, నాణ్యమైన యూనిఫాంలు అందిస్తామని తెలిపారు. పేద పిల్లల కోసం పని చేస్తున్నామనే అంశాన్ని దృష్టిలో ఉంచుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. వచ్చే సంవత్సరం జూన్ 2నాటికే విద్యార్థులకు యూనిఫాం అందేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, ఆయా శాఖల అధికారులు బాల మాయాదేవి, షఫీ ఉల్లా, విజయేంద్ర బోయి, దివ్య పాల్గొన్నారు.

నీటి వనరులను అనుసంధానించాలి : వాటర్ బోర్డుపై సమీక్షలో సీఎం

క్యూర్ పరిధిలో తాగు నీటి సరఫరాకు సంబంధించి సమగ్ర తాగు నీటి సరఫరా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీల తోపాటు విలీన మున్సిపాలిటీల్లోనూ తాగునీటి సరఫరాలో ఏకరూపత ఉండాలన్నారు. రానున్న 50 ఏళ్ల అవసరాలకు తగినట్లు మాస్టర్ ప్లాన్ ఉండాలని సూచించారు. హైదరాబాద్ మహా నగర తాగు నీటి సరఫరా, సీవరేజీ బోర్డు పరిధిలోని పనులపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఎంసీహెచ్ఆర్డీలో గురువారం రాత్రి సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం నెలకొనడంతో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హైదరాబాద్ చుట్టూ ఉన్న తాగు నీటి వనరులను అనుసంధానించాలని సీఎం సూచించారు. ఏదైనా కారణాలతో ఒక సోర్స్ నుంచి నీరు సరఫరా కాకపోయినా మరో సోర్స్ నుంచి వచ్చే నీటిని ఆయా ప్రాంతాలకు సరఫరా చేసేందుకు అనుసంధానత ఉపయోగపడుతుందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఎన్నో ఏళ్లుగా పలు ప్రాంతాల్లో మూడు నాలుగు రోజులకొకసారి తాగునీరు సరఫరా చేస్తున్నారని, ఇక ముందు ఆ పరిస్థితి ఉండకూడదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయా ప్రాంతాలకు రోజు విడిచి రోజు నీరు సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న తాగు నీటి సరఫరా పనులను ఏడాదిన్నరలోపు కచ్చితంగా పూర్తి చేయాలని అధికారులకు తేల్చిచెప్పారు. ఎస్టీపీల నిర్మాణ పనులపై ఆరా తీశారు. వాటిని నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఎక్కడైనా న్యాయపరమైన సమస్యలు ఉంటే వాటిని వేగంగా పరిష్కరించుకునేందుకు ప్రయత్నించాలన్నారు. తాగు నీటి సరఫరా పనులు, ఎస్టీపీల నిర్మాణ పనుల ప్రగతిపై ప్రతి నెలా తనకు నివేదిక సమర్పించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పనుల పురోగతి తెలుసుకునేందుకు వీలుగా డ్యాష్ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. రానున్న రోజుల్లో పరిశ్రమలు, వివిధ నిర్మాణ పనుల్లో గ్రే వాటర్ వాడేలా నిబంధనలు రూపొందించి అమలు చేయాలని సీఎం సూచించారు. సమీక్షలో ఎంఏ యూడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఎండీ అశోక్ రెడ్డి, జేఎండీ మయాంక్ మిట్టల్ పాల్గొన్నారు.

మున్సిపల్ దుకాణాల వేలం

తూప్రాన్ జులై 23 సిరి న్యూస్

తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని మున్సిపల్ కు సంబంధించిన దుకాణాల వేలం గురువారం సమావేశంలో తెలిపారు 7. 8 నెం. గల రెండు దుకాణాలను ఈనెల 29వ తేదీ నాడు 2026– 27 ఆర్థిక సంవత్సరంకు గాను బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ తెలిపారు ఆసక్తి కలవారు వేలానికి సంబంధించిన లక్ష రూపాయల డిడి మున్సిపల్ కమిషనర్ పేరున తీసి కార్యాలయంలో 28. 07.2026 నాడు సాయంత్రం 5:00 గంటల లోపు డిడి లను సమర్పించాల్సి ఉంటుందని ఏమైనా విషయాలు తెలుసుకోవాలనుకున్న వారు ఈ ఫోన్ నెంబర్ ను:9059463462 సంప్రదించవచ్చు అదే రోజు 01.08.2026 నుండి 31.03.2027 వరకు పశువుల అంగడి వేలం నిర్వహిస్తున్నట్టు దీనికి సంబంధించి 50వేల డిడి తీయాల్సి ఉంటుంది దుకాణాల వేలం పద్ధతిలోనే కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందని కమిషనర్ రమేష్ కుమార్ తెలిపారు.

ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్ లను సందర్శించిన సింధు ఆదర్శ్ రెడ్డి..

రామచంద్రపురం, జూలై 23 (సిరి న్యూస్):

భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్ రెడ్డి గురువారం విద్యుత్‌నగర్, మ్యాక్ సొసైటీ కాలనీల్లో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్‌లను సందర్శించి ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు, బీఎల్ఏలు ఎన్యూమరేషన్ ఫారాలు నింపుతున్న తీరును పరిశీలించిన ఆమె, అర్హులైన ప్రతి ఓటరికి సరైన మార్గదర్శనం అందించి ఎలాంటి పొరపాట్లు లేకుండా ఫారాల నమోదు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ, ప్రతి అర్హ ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫారాన్ని సకాలంలో పూర్తి చేసి సంబంధిత బీఎల్‌వోకు అందజేసి ఓటు హక్కును పరిరక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మ్యాక్ సొసైటీ డైరెక్టర్లు నందగోపాల్, దుర్గా రెడ్డి, రామారావు, బీఆర్ఎస్ నాయకులు పాటి సత్యనారాయణ, దేవేంద్ర చారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మలగన్న అమ్మ శాకాంబరి దేవి

- **ముగిసిన ఆధ్యాత్మిక సమరం**
- **ప్రకృతి స్వరూపినిగా జగదంబ**
- **భక్తి పారవశ్యంలో భక్తజనం**

అమీన్పూర్ జులై 23 సిరి న్యూస్

అమీన్పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని బీరంగూడ గుట్టపై వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో గుప్త నవరాత్రి ఉత్సవాలు తొమ్మిది రోజులపాటు అత్యంత నిష్ట రహస్య సాధనాలతో నిర్వహించిన గుప్త నవరాత్రి ఉత్సవాలు మంగళ వాయిద్యాలు, ఆధ్యాత్మిక సంబరాల నడుమ భక్తిశ్రద్ధలతో ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో వైభవంగా ముగిసాయి. గురువారం శాకాంబరి అలంకారం ఉత్సవాల్లో చివరి రోజున జగన్నాథను నానా రకాల పండ్లు కాయగూరలు ఆకుకూరలతో విశేషంగా శాకంబరీ దేవిగా అలంకరించి పూజించారు. పోటెత్తిన భక్తజనం చివరి రోజు అత్యంత విశిష్టమైన శాకాంబరి దర్శనం కావడంతో తెల్లవారుజాము నుంచి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కలు తీర్చుకున్నారు. అలాగే దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో వరుణ్యాగం నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి దేవానందం తెలిపారు.

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

గజ్వేల్ ప్రతినిధి, జూలై 23 :

నీట్ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వేంటనే రాజీనామా చేయాలని, విద్యార్థులు చేస్తున్న శాంతియుత దీక్షలకు డీబీఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి భారత ప్రధాని నరేంద్ర మోడీ నైతిక బాధ్యత వహించి వేంటనే రాజీనామా చేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, జిల్లా అధ్యక్షుడు బ్యాగరి వేణులు డిమాండ్ చేశారు. గురువారం గజ్వేల్ లో దళిత బహుజన ఫ్రంట్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.

నేడు రామాయంపేటకు జగన్నాథ రథయాత్ర

- **రథయాత్రకు భారీ ఏర్పాట్లు..**
- **నిర్వాహకులు పబ్బ సత్యం గుప్త.**
- **రథయాత్రకు ప్రెస్‌క్లబ్ సభ్యులకు ఆహ్వానం...**

రామాయంపేట, జూలై 23 (సిరి న్యూస్)

రామాయంపేట పట్టణానికి నేడు (శుక్రవారం) శ్రీ శ్రీ జగన్నాథ రథయాత్ర రానుంది. ఈ సందర్భంగా రథయాత్రకు విశ్వహిందూ పరిషత్ సభ్యులు, నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. హాజరయ్యే భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు శ్రీ రంగా తీర్థ దాసు, పబ్బ సత్యం గుప్తా, ఇమ్మడి శ్రీనివాస్ గుప్తా, ఎని శెట్టి అశోక్ గుప్తా, చొల్లేటి సంతోష్, గుండు సత్యనారాయణ, పల్లెర్ల రమేష్, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు ఎనిశెట్టి శ్రీవాణి అశోక్ గుప్తా, ప్రధాన కార్యదర్శి బొమ్మల లావణ్య శేఖర్ తెలిపారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ రథయాత్రలో శ్రీశ్రీశ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం, రాధాకృష్ణుల దర్శనం, జగన్నాథ స్వామి సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రథయాత్ర సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు. రథయాత్రలో భాగంగా రథం లాగేందుకు భక్తులకు అవకాశం కల్పించడంతో పాటు, ప్రసాద వితరణ కార్యక్రమం కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తుల కోసం ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భజనలు, కీర్తనలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.రథయాత్రకు సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకులు పబ్బ సత్యం ఆధ్వర్యంలో పర్యవేక్షిస్తున్నారు. ఈ రథయాత్ర కార్యక్రమం పట్టణంలోని వైశ్య భవన్ నుండి ప్రారంభమై గాంధీ విగ్రహం, పొట్టి శ్రీరాములు విగ్రహం మీదుగా బస్టాండ్ వరకు జరుగుతుంది. అక్కడనుండి వివేకానంద విగ్రహం మీదుగా సిద్ధిపేట రోడ్డు నుండి తిరిగి వైశ్య భవన్ కు చేరుకుంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా రథయాత్ర కార్యక్రమానికి హాజరు కావాలని టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జి.శ్రీనివాస శర్మ, జిల్లా కోశాధికారి వూడెం దేవరాజు, రామాయంపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు బసన్నపల్లి మల్లేశంలకు నిర్వాహకులు ప్రత్యేకంగా ఆహ్వానం అందించారు. రథయాత్ర విజయవంతానికి భక్తులు, ప్రజలు సహకరించాలని కోరారు.

భూముల రీసర్వే ద్వారా సమస్యల పరిష్కారం

జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

మెదక్ జులై.23(సిరి న్యూస్)

భూముల రీ సర్వేతో భూ సమస్యలు ఇక చెల్లు అవుతాయని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు.గురువారం మెదక్ మండలం కోమటూరు గ్రామంలో భూభారతి భూముల రీ సర్వేల గ్రామసభలో అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి, ఏడి ల్యాండ్ సర్వే కిషన్ రైతులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు.భూభారతి భూముల రీ సర్వే గ్రామసభ కార్యక్రమం లో కలెక్టర్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి మోకాపై సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతులకు ప్రభుత్వం లబ్ది చేకూర్చనుందని, అక్రమంగా పట్టాలు పొంది ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పొందుతున్న వారికి ఇకపైన రద్దయ్యేలా చర్యలు చేపడ తామని,నిజమైన రైతులకు న్యాయం చేస్తామన్నారు.భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పక్క రికార్డులను చూసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రికార్డులు,మోకా, పట్టాదారుల వివరాలు ఇతర అంశాలను పరిగనలోకి తీసుకుని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. మొదటగా గ్రామంలోని భూములకు సంబంధించి హద్దులు నిర్ధారిస్తామని,తద్వారా గ్రామానికి సంబంధించిన భూమి స్పష్టత వస్తుందని, ప్రభుత్వ భూములు సైతం నిర్ధారణ అవుతాయన్నారు. పట్టా కలిగి ఉండి మోకాపై లేకపోవడం, మోకాపై ఉండి పట్టా కలిగి ఉండకపోవడం అంశాలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటా మన్నారు. సర్వేయర్లు,ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్‌కు..30 ప్రచార రథాలు ఎమ్మెల్యే జీఎంఆర్ శ్రీకారం..

- **ఆగస్టు 3లోపు దరఖాస్తులు పూర్తి చేయాలని పిలుపు**
- **ప్రతి అర్హ ఓటరు ఎస్ఐఆర్‌లో పాల్గొనాలని విజ్ఞప్తి**

పటాన్చెరు, జూలై 23 (సిరి న్యూస్):

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు పటాన్చెరు నియోజకవర్గంలో ప్రత్యేక ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు గురువారం పటాన్చెరు డివిజన్‌లోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి 30 ప్రచార రథాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతి ఓటు ప్రాణాధారమని, ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజకవర్గంలో అభివృద్ధి నిరంతరం కొనసాగాలంటే అర్హులైన ప్రతి ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొని ఆగస్టు 3వ తేదీలోపు దరఖాస్తులను పూర్తి చేయాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొనని వారు ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందని పేర్కొన్న ఎమ్మెల్యే, ఈ ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి అర్హ ఓటరు బాధ్యతగా పూర్తి చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని తొమ్మిది డివిజన్లు, మూడు మున్సిపాలిటీలు, రెండు మండలాల్లోని ప్రతి వార్డు వరకు ఈ 30 ప్రచార రథాలు చేరుకుని ఎస్ఐఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తాయని తెలిపారు. అలాగే వివిధ ప్రజా ప్రదేశాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించిన పుష్ప నగేష్..

రామచంద్రపురం, జూలై 23 (సిరి న్యూస్):

ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురం డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ కాకతీయ నగర్ కాలనీలో పర్యటించి ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు ఎలా నింపాలో ప్రజలకు వివరించారు. పూర్తి చేసిన ఫారాలను సంబంధిత బీఎల్‌వోలతో సమన్వయం చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయించడంతో పాటు, అవసరమైన వారికి ఫారాలు అందేలా చర్యలు చేపట్టారు. అనంతరం కాకతీయ నగర్ కాలనీ అధ్యక్షుడు అమృత్ సాగర్, కాలనీ వాసులు, బీఎల్‌వోలతో సమావేశమై అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఎన్యూమరేషన్ ఫారాల నమోదు ప్రక్రియలో తప్పులు జరగకుండా చర్యలు చేపట్టాలని బీఎల్‌వోలకు సూచించారు.

బోరబట్ల మిషన్ భగీరథ పంప్ హౌస్‌ను పరిశీలించిన

అదనపు కలెక్టర్ పాండు..

హత్నూర, జూలై 23,(సిరి న్యూస్) :

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బోరబట్ల గ్రామ శివారులో ఉన్న మిషన్ భగీరథ పంప్ హౌస్‌ను జిల్లా అదనపు కలెక్టర్ పాండు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంప్ హౌస్‌లో నీటి సరఫరా విధానం, నిర్వహణ, పరికరాల పనితీరు, తాగునీటి పంపిణీకి సంబంధించిన అంశాలను అధికారులతో సమీక్షించారు. అనంతరం అక్కడ విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు, విధి నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.కార్మికులు తెలిపిన సమస్యలు గత 7 నెలల నుండి జీతాలు రావడం లేదని,రాత్రి, పగలు సమయంలో పనిచేసేటప్పుడు ఏలాంటి సేఫ్టీ లేదని కార్మికులు అన్నారు. శ్రద్ధగా విన్న అదనపు కలెక్టర్, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన తాగునీరు అందేలా పంప్ హౌస్ నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో సంబంధిత శాఖ అధికారులు, మిషన్ భగీరథ సిబ్బంది, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

శ్రీ గురు పీఠంలో 29న గురు పౌర్ణమి వేడుకలు..

- **శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్ గౌడ్....**

శివంపేట్ జులై 23 (సిరి న్యూస్)

మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని గూడూరు గ్రామంలో ఉన్న శ్రీ గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ (బుధవారం) గురుపౌర్ణమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహారాజ్ దివ్య ఆశీస్సులతో గూడూరు గ్రామానికి చెందిన పెద్దగోని జన్నారం రమాదేవి– శివకుమార్ గాడ్ దంపతులు నిర్మించి ప్రతిష్ఠించిన శ్రీ దత్తాత్రేయ మహాస్వామి, శిరిడి సాయిబాబా దేవతామూర్తులు కొలువుదీరిన ఈ పుణ్యక్షేత్రంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గురుపౌర్ణమి సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఉదయం 7 గంటలకు శ్రీ మహా దత్తాత్రేయ స్వామివారికి మహారుద్రాభిషేకం, అనంతరం 9 గంటలకు దత్తాత్రేయ అష్టోత్తర శతనామావళి అర్చన, ఉదయం 9.30 గంటలకు గురు స్తుతుల పఠనం, 10 గంటలకు శ్రీ దత్త హారతి, 10.30 గంటల నుంచి శ్రీ గురుచరిత్ర పారాయణం నిర్వహించనున్నారు. అదే విధంగా శిరిడి సాయిబాబా ఆలయంలో ఉదయం 6 గంటలకు కాకడ హారతి, 7 గంటలకు అభిషేకం, 7.30 గంటలకు అర్చన, మధ్యాహ్నం 12 గంటలకు మహా హారతి, మధ్యాహ్నం 2 గంటలకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు సంధ్యా హారతి, రాత్రి 9 గంటలకు శేజ్ హారతితో కార్యక్రమాలు ముగుస్తాయి. గురుపౌర్ణమి రోజున పరమగురువులను దర్శించుకోవడం విశేష పుణ్యఫలమని, భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి శ్రీ దత్తాత్రేయ మహాస్వామి, శిరిడి సాయిబాబా ఆశీస్సులు పొందాలని శ్రీ గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు కోరారు. పంచవటి క్షేత్రంగా పేరుగాంచిన ఈ అరుదైన శ్రీ గురుపీఠంలోని పంచాయతన గురుపరం పర దేవాలయాన్ని దర్శించుకుని ఆధ్యాత్మిక అనందాన్ని పొందాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా ఆలయంలో ప్రత్యేకంగా భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

జర్నలిస్టులకు.. ఆగస్టు 3 వరకు బస్ పాస్ గడువు పొడిగింపు!

TUWJ IJU జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి

సంగారెడ్డి, జూలై 23: (సిరి న్యూస్)

రాష్ట్ర , జిల్లా స్థాయిలలో పని చేస్తున్న జర్నలిస్టులకు 2026–2028 సంవత్సరాలకు సంబంధించిన అక్రిడిటేషన్ కార్డులు జారీ ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నదని TUWJ (IJU) సంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షుడు బండారు యాదగిరి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారికి కార్డుల జారీ ప్రక్రియ వివిధ దశలో ఉన్నదని అన్నారు. ఈ క్రమంలో కోర్టు ఉత్తర్వుల మేరకు అక్రిడిటేషన్ కార్డులపై చెల్లుబాటు వ్యవధిని వచ్చే నెల అంటే ఆగస్టు మూడవ తేదీ వరకు పొడిగించారని చెప్పారు. దానికి అనుగుణంగా.. పాత రాష్ట్ర , జిల్లా పాత్రికేయుల బస్ పాస్‌లన్నింటి చెల్లుబాటు వ్యవధిని 23.07.2026 నుండి 03.08.2026 వరకు (12) రోజులు పొడిగించారని పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారితో పాటు ఆర్టీసీ అధికారులకు ఉత్తర్వులు జారీ అయ్యాయని అన్నారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఉన్నతాధికారులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని బండారు యాదగిరి తెలిపారు.

తాండూర్‌లో ఏఐటీయూసీ శంఖారావం.!

- **ఏఐటీయూసీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి..**
- **ఆగస్టు 2సభలకు కార్మికులు భారీగా తరలిరావాలి: మేకల దాసు..**

మంచిర్యాల, జిల్లాప్రతినిధి జులై 23 (సిరి న్యూస్)

ఆగస్టు 2న నిర్వహించనున్న ఏఐటీయూసీ మంచిర్యాల జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి మేకల దాసు కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు తాండూర్ మండల కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో కొండు బానేష్ అధ్యక్షతన ఏఐటీయూసీ తాండూర్ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మేకల దాసు మాట్లాడుతూ, దేశంలో తొలి కార్మిక సంఘమైన ఏఐటీయూసీ శతాబ్ద కాలంగా కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. కనీస వేతనాలు, సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కు, సమ్మె చేసే హక్కు వంటి అనేక హక్కులు ఉద్యమాల ఫలితమేనని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు శ్రామిక నియమావళులుగా మార్చి కార్మికుల హక్కులను బలహీనపరుస్తోందని విమర్శించారు. ఒప్పంద, బయటి సేవల విధానంలో పనిచేస్తున్న కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా నియమించాలని, కనీస వేతనాలు, భవిష్యనిధి, ఉద్యోగుల రాష్ట్ర బీమా వంటి చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తాండూర్ మండల కన్వీనర్‌గా తాని శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో భయ్యా మొగిలి, సాలీగామ సంతోష్, వాసాల నాగరాజు, పట్టి శంకర్, దాసరి లక్ష్మి, కొండు సాయికుమార్, కుర్సింగ తిరుపతి, మీసాల సన్యాసి, గాజుల దేవయ్య, ముత్తె శంకర్, పెద్దబోయిన చందు, ఉట్నూరి అంకేష్, పెద్దబోయిన లక్ష్మణ్, పెద్దబోయిన మహేందర్, మంచర్ల వెంకటేష్, ధర్మరాజుల అభిరామ్, పెద్దబోయిన మనోహర్, ఎలిగేటి భీమేష్, కమ్మరి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్షరమే ఆయుధం
చదువుతోనే ఉన్నత భవిష్యత్తు

అక్షర వెలుగుల తోనే భవితకు బాటలు

కాంగ్రెస్ నాయకులు చంద్ర రెడ్డి

జిన్నారం జులై 23 సిరి న్యూస్

బొల్లారం డివిజన్ పరిధిలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటుచేసిన అభినందన సభలో పదో తరగతి, ఇంటర్మీడియట్ టాపర్లను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్ర రెడ్డి, జైపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి విద్యార్థులను అభినందించారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన ఆయా విద్యార్థులకు నగదు పురస్కారాలను అందించి ప్రోత్సహించారు. రాష్ట్ర కార్మిక నాయకులు వరప్రసాద్ రెడ్డి మరియు మాజీ ఎంపీటీసీ కృష్ణంరాజులు గతంలో ఇచ్చిన హామీ మేరకు పాఠశాల టాపర్లుగా నిలిచిన పదవ తరగతి, ఇంటర్ ప్రథమ ద్వితీయ సంవత్సర విద్యార్థులలో ఫస్ట్ సెకండ్ ర్యాంకులు సాధించిన వారికి 30 వేల రూపాయల నగదు బహుమానాలను చంద్రారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, గోపాలమ్మ సంపత్ రెడ్డి శ్రీధర్ రెడ్డి రాజగోపాల్ దీనానాథ్ అబ్దుల్ బషీర్ ఇమ్రాన్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో
విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణి !

దాత కొవ్వూరి సాయి ప్రసాద్ రెడ్డి!!

శివంపేట జులై 23 (సిరి న్యూస్)

శివంపేట మండల కేంద్రంలోని చిన్న గొట్టిముక్ల ప్రభుత్వ పాఠశాలలో హర్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు సుమారుగా 40 మందికి ఒక్కొక్కరికి ఏడు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొవ్వూరి సాయి ప్రసాద్ రెడ్డి, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ విద్యుత్ శాఖ వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం ట్రస్ట్ అధ్యక్షులు రవి నాయక్ మాట్లాడుతూ సాయి ప్రసాద్ రెడ్డి మారుమూల గ్రామీణ ప్రాంతంలో ఉన్నటువంటి విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నందుకు ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థుల తల్లిదండ్రుల తరపున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణ గౌడ్, సుబ్బారెడ్డి,రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఇందిరమ్మ చీరల కానుక..

ఇందిరమ్మ చీరల పంపిణీతో మహిళల్లో ఆనందం..

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 23(సిరి న్యూస్)

బెల్లంపల్లి నియోజకవర్గంలోని 19వ వార్డులో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసి మహిళలకు అండగా నిలిచారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ దావా స్వాతి రమేష్‌బాబు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. 19వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాంపెల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా ఇందిరా మహిళాశక్తి మహిళా స్వయం సహాయక సంఘానికి చెందిన అమ్మలు, అక్కలు, చెల్లెళ్లకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాన్ని స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీ రాజ్యలక్ష్మి, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు ఎండీ ఆసిఫ్, యువజన నాయకుడు రామిల్ల ప్రదీప్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దుర్గం మహేందర్, యువజన ఉపాధ్యక్షుడు అబ్దుల్ జిబి ఇమ్ము, నాలుగో వార్డు ఇన్‌చార్జి పంగ భరత్, వార్డు సభ్యులు అక్కపాక రంజిత్ కుమార్, రామ్ నరేష్, కాంపెల్లి శివకుమార్, బస్తీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మంచిర్యాల మార్కెట్ కమిటీకి కొత్త చైర్మన్..

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా రామగిరి బానేష్ నియామకం..
- రైతులకు గిట్టుబాటు ధరలే లక్ష్యం..బానేష్..

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 23 (సిరి న్యూస్)

మంచిర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా రామగిరి బానేష్ నియామకమయ్యారు. ఈ విషయాన్ని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ప్రకటించారు. బానేష్ నియామకాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించారు. ఈ సందర్భంగా రామగిరి బానేష్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు లభించడం పార్టీ ప్రత్యేకత అని అన్నారు. తనపై విశ్వాసం ఉంచి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, మాజీ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు సురేఖమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. మంచిర్యాల జిల్లా వ్యవసాయ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిందని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించేలా కృషి చేస్తానని చెప్పారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మార్కెట్ సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు కట్టుబడి పనిచేస్తానని బానేష్ స్పష్టం చేశారు.

కాలనీ కష్టాలకు స్వస్తి

- నల్లూరి హైట్స్ కాలనీలో మెరిసిన సి సి రోడ్డు
- సొంత ఖర్చుతో రహదారి వేయించిన శశిధర్ రెడ్డి

అమీన్పూర్ జులై 23 సిరి న్యూస్

అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ డివిజన్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శశిధర్ రెడ్డి నల్లూరి హైట్స్ కాలనీవాసుల సౌకర్యార్థం తన సొంత నిధులను వెచ్చించి సిసి రహదారిని నిర్మింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో రహదారి సరిగ్గా లేకపోవడంతో వర్షాలు కురిసి గుంతలు పడి, కాలనీవాసులు వాహనదారులు పడుతున్న ఇబ్బందులను గమనించి ఈ నిర్ణయం తీసుకున్నా అని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో చుక్క రెడ్డి నరేందర్ రెడ్డి రామచంద్రారెడ్డి మురళి వెంకట్ రెడ్డి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ హఠావో దేశ్ బచావో మా నినాదం

- రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడం అమానుషం
- విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న మోదీ ప్రభుత్వం
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

సిద్ధిపేట జిల్లా ప్రతినిధి, జూలై 23, :

నీట్ లీకేజీ వ్యవహారంపై శాంతియుహంగా నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని, విపక్ష నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం అమానుషం అని, మోదీ హఠావో దేశ్ బచావో మా నినాదం అని కాంగ్రెస్ పార్టీ సిద్ధిపేట నియోజకవర్గం ఇంచార్జ్ పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. ఢిల్లీలో ప్రతిపక్ష నేత శాంతియుతంగా నిరసన చేస్తే రాహుల్ గాంధీని అరెస్టు చేసినందుకు హైదరాబాద్ లోని గాంధీభవన్ లో కాంగ్రెస్ నాయకుల ప్లెక్సిని బీజేపీ గుండాలు చింపివేసినందుకు నిరసిస్తూ గురువారం సిద్ధిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆధ్వర్యంలో సిద్ధిపేట లోని బీజేపీ కార్యాలయం ముట్టడికి యత్నించారు. ముట్టడికి వెళ్తున్న సిద్ధిపేట కాంగ్రెస్ నియోజకవర్గం ఇంచార్జ్ పూజల హరికృష్ణ, పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్, గోపీకృష్ణ, తదితర నాయకులు, కార్యకర్తలను పోలీసును అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పూజల హరికృష్ణ, అత్తు ఇమామ్ మాట్లాడుతూ నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు కాంగ్రెస్ పార్టీ నాయకులపై లాఠీచార్జి చేయించడం లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీని అక్రమంగా అరెస్టుచేయడం అప్రజాస్వామికం అని అన్నారు. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపి బాఽధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ఈ చర్యలు మోదీ నిరంకుశత్వానికి నియంతృత్వ ధోరణికి పరాకాష్ట అని మండిపడ్డారు. నీట్ లీకేజీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నీట్ లీకేజీతో ఆత్మహత్యకు పాల్పడ్డ విద్యార్థులకు వెంటనే ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. నీట్ లీకేజిపై మోదీ ఇంతవరకు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. అధికారం ఉందని పోలీసుల చేత విద్యార్థులపై, ప్రశ్నిస్తున్న విపక్ష నేతలపై లాఠీచార్జ్ చేయడం దుర్మార్గం అని అన్నారు. నీట్ లీకేజీ ఘటనకు బాధ్యతలను వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని అన్నారు. దేశాన్ని కాపాడాల్సిన ప్రధాని మోదీ అండతోనే బీజేపీ నాయకులు వీధి రౌడీల్లా రెచ్చిపోతున్నారని అన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వంలో విద్యార్థులకు సంబంధించిన 152 రకాల పరీక్ష పత్రాలు లీకేజీ జరిగింది వాస్తవం కాదా అని అన్నారు. విద్యార్థులు విపక్ష నేతలపై అమానుషంగా ప్రవర్తించిన నరేంద్ర మోదీ విద్యార్థులకు విపక్ష నేతలకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు. దేశంలో మోదీ గ్రాఫ్ పడిపోయిందని వచ్చే ఎన్నికల్లో బీజేపీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆరు మొక్కలు..పచ్చని గ్రామం..

- మొక్క నాటండి.. భవిష్యత్తు కాపాడండి..
- పొన్నారంలో పచ్చదన ఉద్యమానికి శ్రీకారం..

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 23 (సిరి న్యూస్)

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, గ్రామాన్ని పచ్చదనంతో నింపాలనే లక్ష్యంతో మందమర్రి మండలం పొన్నారం గ్రామంలో ప్రతి ఇంటికీ ఆరు మొక్కలను పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంచాల మధు పాల్గొని మొక్కలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ పెంచాల మధు మాట్లాడుతూ, పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించి భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి కుటుంబం తప్పని సరిగా మొక్కలు నాటాలని అన్నారు. నాటిన మొక్కలను సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యతేనని పేర్కొన్నారు. గ్రామ ప్రజలందరూ మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా భావించి పచ్చదనం పెంపొందించేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఉపసర్పంచ్ అమృత, గ్రామ కార్యదర్శి హరీశ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చేయి తడిపితే చాలు...
యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు !

టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి జోరు

- బోయిన్‌పల్లి సర్కిల్-3లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు..
- 5 నెలలుగా అక్రమ నిర్మాణాలపై ఒక్క కూల్చివేత లేదు..
- ప్రశ్నిస్తే బదులివ్వని ఏసీపీ తీరుపై విమర్శలు..
- సెక్షన్ అధికారి సాకులు, దాటవేత సమాధానాలు..
- టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం..
- తక్షణమే అక్రమ నిర్మాణాలకు కూల్చివేయాలని స్థానికుల డిమాండ్..

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 23 (సిరి న్యూస్)

చేతులు దులుపుకుంటున్న సెక్షన్ అధికారి..

5 నెలలుగా ఒక్క కూల్చివేత లేదు...

కూకట్‌పల్లి జీహెచ్ఎంసీ జోన్ నుంచి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి మారుతూ, పాత సర్కిల్ 24 స్థానంలో 2026 ఫిబ్రవరిలో కొత్తగా ఏర్పాటైన ఓల్డ్ బోయిన్‌పల్లి సర్కిల్-3 పరిధిలో మొండా మార్కెట్, ఫతేనగర్, ప్రకాశ్‌నగర్, ఓల్డ్ బోయిన్‌పల్లి, హస్మత్‌పేట్ డివిజన్లు ఉన్నాయి. పునర్వ్యవస్థీకరణ జరిగి ఐదు నెలలు గడుస్తున్నా, ఈ సర్కిల్‌లో ఇప్పటివరకూ ఒక్క అక్రమ నిర్మాణాన్ని కూడా టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చిన దాఖలాలు లేవు, సీజ్ చేసిన సందర్భాలూ లేవు..

మాట్లాడేందుకే సిద్ధంగా లేని ఏసీపీ...

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేసినా ఇంతవరకూ ఎందుకు చర్యలు తీసుకోలేదు అని ఏసీపీని నిలదీసేందుకు స్థానికులు ప్రయత్నించగా, ఆయన మాట్లాడేందుకు కూడా సిద్ధంగా లేకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. ప్రజా సమస్యలపై జవాబుదారీగా ఉండాల్సిన అధికారి, కనీసం స్పందించేందుకు కూడా నిరాకరించడం ఆయన నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు.

లక్షల్లో జీతం.. క్షేత్రస్థాయిలో శూన్యం..

డిప్యూటీ కమిషనర్, ఏసీపీ, సెక్షన్ అధికారులు లక్షల్లో జీతాలు తీసుకుంటూ, ప్రజాధనంతో పోషించబడుతూ, క్షేత్రస్థాయి బాధ్యతలు మరిచారా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాలు ఆగక పోవడం వెనుక సెటిల్‌మెంట్‌ల పాత్ర ఉందా.? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చేతులు తడిస్తే చాలు.?..ఎంత ఎత్తయినా, ఏ నిబంధన అతిక్రమించినా పట్టించుకోరు అని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి..

మాట్లాడేందుకే సిద్ధంగా లేని ఏసీపీ, వివరాలు కోరితే దాటవేసే సెక్షన్ అధికారి తీరుపై మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్‌లో అసలు బాధ్యులెవరు? ఈ అక్రమాలకు అండగా నిలుస్తున్నదెవరు? ఇప్పటికైనా అధికారులు మేల్కొని క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టకపోతే, రానున్న రోజుల్లో స్థానికులు ఆందోళన బాట పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఓల్డ్ బోయిన్‌పల్లి సర్కిల్-3లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు..







అలా ప్రకృతిలో ఒడిలో...

వీ వీకెండ్

కొందరికి సమ్మర్ టూర్లంటే ఇష్టం. మరికొందరికి మాన్‌సూన్ టూర్లంటే ఇష్టం ఉంటుంది. కానీ, టైం మాత్రం ఉండదు. అందుకే చాలామంది వీకెండ్ టూర్లు ప్లాన్ చేస్తుంటారు. అందుకోసం దగ్గరగా ఉండే ప్రదేశాలను ఎంచుకుంటారు. ఆ లిస్ట్‌లో ఈ జలపాతాలు కూడా ఉన్నాయి. అవేంటో ఒకసారి చూసేయండి.



మల్లెల తీర్థం

శ్రీశైలానికి 58 కిమీల దూరంలోని నల్లమల్ల అడవుల్లో ఉంది మల్లెల తీర్థం జలపాతం. ఇది హైదరాబాద్‌కు 170 కిమీల దూరంలో ఉంది. ఈ జలపాతంలో స్నానాలు చేయాలంటే దాదాపు 250 మెట్లు దిగి కిందికి వెళ్లాలి. వర్షా కాలంలో ఈ ప్రాంతం చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. అయితే, నీటిలో దిగడం ప్రమాదకరం!

కవ్వాల్ వైల్డ్ లైఫ్ సాంక్చురీ

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రకృతి రమణీయత గల ఎన్నో పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. కుంతల రాజ్యం నాటి కుంటాల జలపాతం, బోథ్ పొచ్చెర జలపాతం, కవ్వాల్ వైల్డ్ లైఫ్ సాంక్చురీ జంగల్ సఫారీ, బాసర సరస్వతి దేవాలయం, శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్, నిర్మల్ కొయ్యబొమ్మలు మొదలైనవి ఎన్నో చూడవచ్చు. హైదరాబాద్ నుంచి సుమారు 250 కిలోమీటర్ల పరిధిలో ఈ పర్యాటక ప్రదేశాలున్నాయి. ఇక్కడికి చేరుకోడానికి ప్రసిద్ధ నేషనల్ హైవే 44తో విశాలమైన రోడ్డు కనెక్టివిటీ ఉంది.

ఎత్తిపోతల జలపాతం

ఇది నగరానికి 173 కిమీల దూరంలో ఉంది. నాగార్జున సాగర్ నుంచి 14 కిమీలు ప్రయాణిస్తే ఎత్తిపోతల వస్తుంది. కృష్ణానది ఉపనది అయిన చంద్రవంక నది 70 అడుగుల ఎత్తు నుంచి దూకుతూ ఆశ్చర్యంలో ముంచెత్తుతుంది. వర్షాకాలంలో ఈ జలపాతం చాలా వేగంగా ప్రవహిస్తుంది. ఇక్కడ స్నానాలు చేయడం ప్రమాదకరం.

భీముని పాదం జలపాతం

హైదరాబాద్‌కు 200 కిమీల దూరంలో వరంగల్ జిల్లాలోని గూడూరు మండలం.. సీతానాగారం సమీపంలో ఈ జలపాతం ఉంది. వరంగల్ నుంచి 51 కిమీల దూరంలో ఉన్న ఈ జలపాతం ఆహ్లాదకరంగా, ఆకర్షనీయంగా ఉంటుంది. ఇక్కడ అన్ని కాలాల్లో నీరు ఉంటుంది.

రెండింటికీ ఒకటే సాల్యూషన్

రోజ్ వాటర్ అంటే గులాబీ రేకుల నుంచి తయారయ్యే నీరు. ఈ వాటర్‌ని సౌందర్యసాధనంగా వాడతారు. ఇప్పటికే చాలామంది రోజ్ వాటర్ చర్మానికి వాడుతూనే ఉండొచ్చు. అయితే, దీనివల్ల జుట్టుకు కూడా చాలా మేలు జరుగుతుందని తెలుసా! అవును.. రోజ్ వాటర్‌తో చర్మానికే కాదు.. జుట్టు సమస్యలకు కూడా చెక్ పెట్టేస్తుంది. అదెలాగో తెలుసుకుందాం.

చర్మానికి :

రోజ్ వాటర్ నేచురల్ హైడ్రేటర్‌గా పనిచేస్తుంది. ఇది చర్మం పొరల లోతుల్లోకి వెళ్లి, కాంతివంతంగా చేస్తుంది. అంతేకాదు.. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ప్రాపర్టీలు కూడా ఉన్నాయి. అవి చర్మం మీద దురద, దద్దుర్లు, మచ్చలు, డెర్మటైటిస్, ఎగ్జిమా వంటివాటిపై ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. అలాగే రోజ్ వాటర్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు స్కిన్ సెల్స్ డ్యామేజ్ కాకుండా సంరక్షిస్తుంది. వయసు పెరిగిన ఆనవాళ్లను తెలియకుండా చేస్తుంది. ముడతలు కనపడకుండా చేస్తుంది. ఇవే కాకుండా.. రోజ్ వాటర్ పీహెచ్ స్థాయిలను కంట్రోల్ చేయడంలో సాయంచేస్తుంది. దాంతో ఆయిల్ ఎక్కువగా ఉత్పత్తి కాకుండా కంట్రోల్ చేస్తుంది. ఇందులో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ ప్రాపర్టీస్ గాయాలను మాన్పేందుకు తోడ్పడుతుంది. ఎఫెక్ట్ అయిన ప్రాంతంలో ఇన్‌ఫెక్షన్ కాకుండా శుభ్రంగా ఉంచుతుంది.

ఎలా వాడాలంటే..

చర్మానికి రోజ్ వాటర్‌ని టోనర్‌లా వాడాలి. ఎక్కడైతే అప్లయ్ చేయాలనుకుంటున్నారో ఆ ప్రాంతాన్ని ముందుగా శుభ్రం చేయాలి. తర్వాత కాటన్ పాడ్‌తో అప్లయ్ చేయాలి. అలాగే దీన్ని మేకప్ రిమూవర్‌గా కూడా వాడొచ్చు. అందుకోసం కొబ్బరి నూనెలో రోజ్ వాటర్ వేసి కలపాలి. దాంతో ఎఫెక్టివ్ మేకప్ రిమూవర్‌గా పనిచేస్తుంది. అంతేకాదు.. స్ప్రేలా కూడా వాడొచ్చు. రోజ్ వాటర్‌ని స్ప్రే బాటిల్‌లో పోసి ముఖంపై స్ప్రే చేయాలి. దీంతో మేకప్ చూడ్డానికి ఫ్రెష్‌గా కనిపిస్తుంది. ఇవేకాకుండా రోజ్ వాటర్‌ని తేనె, పెరుగు వంటివాటితో కలిపి ఫేస్ మాస్క్‌లా కూడా వాడొచ్చు. మచ్చలు పడతాయనిపిస్తే ఆ చోట రోజ్‌వాటర్‌ని నేరుగా అప్లయ్ చేయొచ్చు. ఇది వాడటం వల్ల మొటిమలు రావు.

జుట్టుకి

జుట్టుకి రోజ్ వాటర్ వాడితే మాయిశ్చరైజర్‌లా పనిచేస్తుంది. మృదువుగా, మెరిసేలా చేస్తుంది. చుండ్రుని తగ్గిస్తుంది. కుదుళ్లకు బలాన్నిస్తుంది. పుర్రె భాగంలో పీహెచ్ స్థాయిలను బ్యాలెన్స్ చేస్తుంది. దాంతో ఆయిల్ ప్రొడక్షన్ ఎక్కువ కాకుండా చేస్తుంది. నేచురల్ సెంట్‌లా కూడా పనిచేస్తుంది.

ఇలా వాడాలి

షాంపూ, కండిషనర్ వాడిన తర్వాత చివరిగా రోజ్ వాటర్‌తో కడగాలి. పుర్రె భాగానికి రోజ్ వాటర్‌ని నేరుగా అప్లయ్ చేసి మర్దన చేయాలి. అలా చేస్తే చుండ్రు తగ్గుతుంది. జుట్టు పెరగడానికి ఉపయోగపడుతుంది. అలాగే రోజ్ వాటర్‌ని స్ప్రే బాటిల్‌లో పోసి రోజంతా హెయిర్ మిస్ట్‌గా వాడొచ్చు. రోజ్ వాటర్ కొన్ని చుక్కలు రెగ్యులర్‌గా వాడే కండిషనర్‌లో వేసుకుంటే మాయిశ్చరైజర్‌లా పనిచేస్తుంది. అంతేకాదు.. రోజ్ వాటర్‌ని గ్లిజరిన్‌తో కలిపి వాడితే, మాయిశ్చర్‌లా కనిపిస్తుంది. జుట్టు మెరిసేలా చేస్తుంది.

బ్రేకప్ తర్వాత...

ఈ రోజుల్లో ప్రేమలో పడడం చాలా సహజం. కానీ, అన్ని ప్రేమలూ విజయవంతం కావు. కొన్ని మధ్యలోనే బ్రేక్ అవుతాయి. అయితే, బ్రేకప్ తర్వాత లైఫ్‌లో ఎలా ముందుకెళ్లాలో, మునుపటిలా లైఫ్‌ని ఎలా లీడ్ చేయాలో అర్థంకాక డైలమాలో ఉంటారు. కొందరు ఈ స్టేజీలోనే డిప్రెషన్‌కి కూడా గురవుతుంటారు. మరి దీనికి సాల్యూషన్ ఏంటి? బ్రేకప్ తర్వాత నార్మల్ లైఫ్ లీడ్ చేయాలంటే ఏం చేయాలి? ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇవే.

1. బ్రేకప్ తర్వాత మాజీ ప్రేమికులతో కాంటాక్ట్ ఉండకూడదు. మెసేజ్, ఫోన్ కాల్, సోషల్ మీడియా ద్వారా గానీ.. ఎలాంటి కమ్యూనికేషన్ మెయింటెయిన్ చేయకూడదు. ఎందుకంటే.. ఏదో ఒకరకంగా ఇంటరాక్షన్ ఉంటే మీ మాజీ లవర్ పాతగాయాల్ని రేపడానికి ప్రయత్నిస్తారు. తిరిగి మిమ్మల్ని వాళ్ల లైఫ్‌లోకి రప్పించుకునేందుకు రకరకాలుగా ప్రయత్నిస్తారు. అదే కాంటాక్ట్ లేకుండా దూరంగా ఉంటే.. మనసుకు తగిలిన పాతగాయాలు త్వరగా మానిపోతాయి. అప్పుడు మీ మీద మీరు ఫోకస్ చేయగలుగుతారు. కొత్త లైఫ్ స్టార్ట్ చేస్తారు.

2. మాజీ లవర్‌కి సంబంధించిన వస్తువులు ఏమైనా ఉంటే వాటిని తీసిపారేయాలి. అది మీకు కష్టంగా, సవాలుగా అనిపించొచ్చు. కానీ అలా చేసి తీరాలి. అప్పుడు మీ చుట్టు కొత్త వాతావరణం ఏర్పడుతుంది. ఈ పని చేసేందుకు మీరు బాగా నమ్మే వాళ్ల సాయం తీసుకోండి. వాళ్లు మీకు ఎమోషనల్‌గా కూడ సపోర్ట్ చేస్తారు.

3. బ్రేకప్ వల్ల మిమ్మల్ని మీరు అర్థం చేసుకునే అవకాశం దొరుకుతుంది. పర్సనల్ గ్రోత్‌కి ఆస్కారం ఉంటుంది. ఏం జరిగింది? అనేది మీ అనుభవాల ద్వారా లోతుగా తెలుసుకునే ప్రయత్నం చేయగలుగుతారు. ఈ రిలేషన్ షిప్ నుంచి నేను ఏం నేర్చుకున్నా? అని ప్రశ్నించుకునే సమయం ఇది. మీ భావాలను, ఆలోచనలను ఒక పేపర్ మీద పెట్టండి.

4. బ్రేకప్ తర్వాత సపోర్ట్ సిస్టమ్ అనేది లేకపోతే చాలా కృంగిపోతారు. మీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడండి. మిమ్మల్ని ప్రేమించేవారితో టైం స్పెండ్ చేయండి. మీకు నచ్చే యాక్టివిటీలు చేయండి. మీ ఫీలింగ్స్ ఇతరులతో షేర్ చేసుకోండి. బాధలో ఉన్నప్పుడు ఒంటరిగా అస్సలు ఉండకండి.

5. ఎమోషన్స్‌ని అణచుకోకండి. మీ భావోద్వేగాలను మీరు ఫీల్ అవ్వండి. ఏడవాలనిపిస్తే ఏడ్వేయండి. అది కోలుకోవడానికి బాగా ఉపయోగపడుతుంది. మీ కోపం, బాధ అన్నీ అందులో వెళ్లిపోతాయి. ఫీలింగ్స్ బయటపెట్టడానికి సిగ్గపడకండి.

బ్రేకప్ నుంచి కోలుకోవడం అంత ఈజీ అయితే కాదు. కానీ, ఈ చిట్కాలు పాటిస్తే మంచి రిజల్ట్ కచ్చితంగా చూస్తారు. ఒకటి మాత్రం గుర్తుపెట్టుకోవాలి. గాయం మానాలంటే.. కొంత సమయం పడుతుంది.

ఆ పాత్రలకు దూరమే: కాజల్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ మరోసారి తన వ్యక్తిగత అభిప్రాయాలను వెల్లడించారు. సినిమాల్లో బికినీ, బోల్డ్ సన్నివేశాలు, రొమాంటిక్ పాత్రలపై జరుగుతున్న చర్చల మధ్య ఆమె చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. పెళ్లి తర్వాత కూడా గ్లామర్ పాత్రలు చేయడంపై వస్తున్న విమర్శల నేపథ్యంలో కాజల్ స్పందించిన తీరు సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ప్రస్తుతం 'ది ఇండియా స్టోరీ' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్న కాజల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. సినీ ప్రయాణం ప్రారంభం నుంచే తాను బికినీ లేదా అతిగా బోల్డ్ సన్నివేశాల్లో నటించడానికి ఆసక్తి చూపలేదని తెలిపారు. అలాంటి పాత్రలు చేయడం తనకు వ్యక్తిగతంగా అసౌకర్యంగా అనిపిస్తుందని, అందుకే కొన్ని పెద్ద అవకాశాలను కూడా వదులుకున్నానని చెప్పారు. సినిమాల కోసం లేదా డబ్బు కోసం తన వ్యక్తిత్వాన్ని మార్చుకోలేనని, తనకు కొన్ని విలువలు, సిద్ధాంతాలు ఉన్నాయని వాటితో ఎప్పుడూ రాజీ పడనని కాజల్ స్పష్టం చేశారు. తెరపై బోల్డ్ సన్నివేశాల్లో నటించాల్సిన అవసరం ఉందని తాను భావించనని పేర్కొన్నారు.

తల్లి అయిన తర్వాత తన ఆలోచనల్లో మరింత మార్పు వచ్చిందని ఆమె తెలిపారు. తన కుమారుడు నీల్ కిచ్లూ పెద్దయ్యాక తన సినిమాలు చూసి గర్వపడాలని కోరుకుంటానని, అతనికి అసౌకర్యంగా అనిపించే పాత్రల్లో నటించకూడదనే ఉద్దేశంతో ఇప్పుడు ప్రతి కథను ఎంతో ఆలోచించి ఎంపిక చేసుకుంటున్నానని చెప్పారు. ఇటీవల యశ్ నటిస్తున్న 'టాక్సిక్' చిత్రంలోని రొమాంటిక్ సన్నివేశాలపై సామాజిక మాధ్యమాల్లో చర్చ జరిగిన నేపథ్యంలో కాజల్ గతంలో చేసిన వ్యాఖ్యలు మళ్లీ ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పెళ్లి తర్వాత హీరోయిన్లు గ్లామర్ పాత్రలు చేయడంపై జరుగుతున్న చర్చల మధ్య తన వ్యక్తిగత విలువలను మరోసారి స్పష్టం చేయడంతో నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

ఇదిలా ఉండగా, కాజల్ ప్రధాన పాత్రలో నటించిన 'ది ఇండి యా స్టోరీ' చిత్రం జులై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే నంద మూరి బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఎన్‌బీకే 111' చిత్రంలో కథానాయికగా నటిస్తూ మరోసారి తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు.

వెండితెరకు సెలవు

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ చివరి సినిమాగా ఆయనే స్వయంగా చెప్పుకుంటూ వచ్చిన జన నాయకుడు అష్టకష్టాలు దాటుకుని ఎట్టకేలకు థియేటర్లలో అడుగు పెట్టేసింది. కర్ణాటకలో ఉదయం ఆరు గంటలకే షోలు పడిపోగా తెలుగు రాష్ట్రాల్లో ఎనిమిది గంటలకు తమిళనాడులో తొమ్మిది గంటలకు ప్రారంభమయ్యాయి. విజయ్ స్వంత రాష్ట్రంలో బ్లాక్ టికెట్లు విచ్చల విడిగా అమ్మినట్టు కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడాన్ని టీవీకే పార్టీ సీరియస్ గా తీసుకుని విచారణ చేస్తోంది. ఆరు నెలలకు పైగా సెన్సార్ వివాదం వల్ల ల్యాబ్ లోనే మగ్గిన జన నాయకుడు మీద తమిళనాడులో క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదని బుకింగ్స్ స్పష్టం చేస్తున్నాయి. చెన్నైలో ఉన్న మాయాజాల్ పదహారు స్క్రీన్ల మల్టీప్లెక్సులో రోజు మొత్తం కలిపి ఒక్క టికెట్ అందుబాటులో లేదంటే క్రేజ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అక్కడే కాదు కోయంబత్తూర్, పెరంబూరు లాంటి పట్టణాలు నగరాలు ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. వీకెండ్ దాకా పెద్దగా మార్పు ఉండకపోవచ్చు.

ఒకవేళ విజయ్ అధికారంలో రాకపోయి ఉంటే ఎలా ఉండేదో కానీ తలపతిని సిఎంగా చూసుకుంటూ ఇప్పుఈ సినిమాను సెలెబ్రేట్ చేసుకోవడం ఫ్యాన్స్ ఎమోషనల్ గా తీసుకుంటున్నారు. ఇది ఎక్కడి దాకా వెళ్లిందంటే 25 రోజులకు జరిపే ఫ్యాన్ షో ఇప్పుడే హౌస్ ఫుల్ అయ్యేంత. మొదటి రోజు రికార్డు ఓపెనింగ్ ఖాయమే కానీ అది ఎంత మొత్తంలో ఉంటుందనేది రేపటికి క్లారిటీ రానుంది. కొంత కాలంగా తమిళంలో చెప్పుకోదగ్గ స్టార్ సినిమా లేక పోవడం పెద్ద ప్లస్ కానుంది.

అసాధ్యం అనుకున్నది ప్రభాస్ చేయగలరా

టాలీవుడ్ స్టార్ హీరో ఎవరైనా సరే ఏడాదికి ఒక సినిమా విడుదల చేయడమనేది కలగా మిగిలిపోయింది. పవన్ కళ్యాణ్ చేసి చూపించారు కానీ దానికి కారణాలు వేరు. హరిహర వీరమల్లు, ఓజి షూటింగుల్లో జరిగిన విపరీతమైన జాప్యం వల్ల వాటికి ఉస్తాద్ భగత్ సింగ్ కు తక్కువ గ్యాప్ వచ్చింది కానీ, ముందుగా అనుకుని చేసినవి కాదు. ఇక అల్లు అర్జున్, రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్ వరస తెలిసిందే. రెండేళ్లు మినిమమ్ టైంగా మారిపోయింది. దానికి తోడు రిలీజుల వాయిదాలు. అయితే ప్రభాస్ వీళ్లకు భిన్నమైన వేగంతో వెళ్లడం ప్రత్యేకంగా గమనించాలి. డిసెంబర్ 3 ఫౌజీ రాకలో ఎలాంటి అనుమానం లేదు. కన్ఫర్మ్ అయిపోయింది. టైం తక్కువగా ఉన్నప్పటికీ దర్శకుడు హను రాఘవపూడి రెండు యానిట్లతో పని చేయిస్తున్నారు. మైత్రి టీమ్ కూడా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఎక్కడా బ్రేక్ రాకుండా చూసుకుంటోంది. బాలీవుడ్, ఓవర్సీస్ మార్కెట్ పరంగా అన్నింటికి అదే అనువైన తేదీ కావడంతో ఎట్టి పరిస్థితుల్లో దాన్ని వదులుకునే ఉద్దేశంలో లేరు. ఇది జరిగిన మూడు నెలలకు మార్చిలో స్పిరిట్ వచ్చేయాలి. ఇప్పటికే నలభై శాతం పూర్తి చేసిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఎక్కువ లొకేషన్స్, విఎఫ్ఎక్స్ హడావిడి లేకుండా యానిమల్ తరహాలో చాలా ఆర్గానిక్ గా తీస్తున్నారట. అందుకే వేగంగా అవుతోందని టాక్. ఇది కూడా డెడ్ లైన్ వదిలే ప్రసక్తే లేదనే తరహాలో పరుగులు పెడుతోంది. డిస్ట్రిబ్యూషన్ వర్గాలు అందరితో చర్చించాకే ప్యాన్ ఇండియా కోణంలో బెస్ట్ డేట్ అవుతుందని భావించి మార్చ్ 5 లాక్ చేసుకున్నారు. అంటే కేవలం మూడు నెలల గ్యాప్ లో రెండు సినిమాలు ప్రభాస్ నుంచి వచ్చినట్టు అవుతుంది. అంతేకాదు రాజా సాబ్ నుంచి చూసుకుంటే పదమూడు నెలల కాలంలో మూడు ప్యాన్ ఇండియా మూవీస్ ఇవ్వడం, ప్రభాస్ లాంటి స్టార్ హీరోకు సాధ్యం కావడం మిగిలిన వాళ్లకు స్ఫూర్తిగా నిలవాలి. తర్వాత కల్కి 2, సలార్ 2 లైన్ లో పెట్టిన ప్రభాస్ ఇవి కాకుండా ఇంకెవరికి కొత్త కమిట్ మెంట్స్ ఇవ్వలేదు. పలువురు దర్శకులు ప్రయత్నాల్లో ఉన్నారు కానీ ఇంకా ఫైనల్ కాలేదు.

'రా ఎన్టీఆర్'కు గుడ్‌బై..



జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల పేరిట భారీ సేవా కార్యక్రమాలు చేపడతామని ప్రకటించి సోషల్ మీడియాలో హల్చల్ చేసిన 'రా ఎన్టీఆర్' సంస్థ ఇప్పుడు అనూహ్య నిర్ణయం తీసుకుంది. కొద్ది రోజుల క్రితం వరకు వార్తల్లో నిలిచిన ఈ సంస్థ, తాజాగా తమ కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా విడుదల చేసిన ప్రకటనలో 'విజయం సాధించిన వారందరికీ మా అభినందనలు' అంటూ వ్యంగ్యం గా గుడ్‌బై చెప్పడం ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. అసలు ఈ వివాదానికి ఆరంభం 'ఊరు-వాడ' పేరుతో ప్రకటించిన సేవా కార్యక్రమాలే. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 100 కోట్లతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని సంస్థ ప్రకటించడంతో ఒక్కసారిగా అందరి దృష్టి దానిపై పడింది. ఈ ప్రకటన తర్వాత తమిళ హీరో విజయ్ తన అభిమాన సంఘాల ద్వారా చేపట్టిన సేవా కార్యక్రమాల తరహాలోనే ఇది కూడా ఉందని, జూనియర్ ఎన్టీఆర్ రాజకీయ రంగ ప్రవేశానికి ఇదే తొలి అడుగు కావచ్చని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే ఆ ప్రచారానికి అంతే త్వరగా బ్రేక్ కూడా పడింది. ఈ మధ్యనే జూనియర్ ఎన్టీఆర్ కార్యాలయం అధికారికంగా స్పందిస్తూ 'రా ఎన్టీఆర్' సంస్థతో మాకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఎన్టీఆర్ పేరు, ఇమేజ్‌ను ఉపయోగించి కొందరు వ్యక్తిగత ప్రయోజనం పొందేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపింది. దీంతో నందమూరి అభిమానుల్లో చాలామంది కూడా ఈ సంస్థపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వివాదం పెరుగుతున్న నేపథ్యంలో సంస్థ ప్రతినిధి సాయి రూప్ తిరుపతిలో మీడియా సమావేశం నిర్వహించి తమ ఉద్దేశం పూర్తిగా సామాజిక సేవేనని వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. అయితే 100 కోట్ల నిధులు ఎలా సమీకరిస్తారనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వలేకపోవడంతో అనుమానాలు మరింత పెరిగాయి. దీంతో సోషల్ మీడియాలో విమర్శలు మరింత తీవ్రం అయ్యాయి.

శారీలో శివాని అందాల సందడి

నటి శివాని నగారం మరోసారి తన తాజా ఫొటోషూట్‌తో అభిమానుల దృష్టిని ఆకర్షించింది. సముద్రతీరంలో గాఢ ఎరుపు రంగు చీరలో కనిపించిన ఆమె అందం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. గాలికి ఎగిరే చీరకొంగు, మబ్బులతో నిండిన ఆకాశం నేపథ్యంగా ఆమె ఇచ్చిన హావభావాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఇటీవల సుహాస్ కథానాయకుడిగా వచ్చిన 'హే బల్వంత్' చిత్రంలో శివాని నగారం కనిపించింది. ఆ చిత్రం ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోకపోయినా, తన పాత్ర పరిధిలో ఆమె నటనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. అయితే పాత్రకు పెద్దగా ప్రాధాన్యం లేకపోవడంతో ఆమె ప్రతిభ పూర్తిస్థాయిలో వెలుగులోకి రాలేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

ప్రస్తుతం సినిమాలకు కొంత విరామం లభించిన నేపథ్యంలో శివాని వరుస ఫొటోషూట్లతో అభిమానులను అలరిస్తోంది. ముఖ్యంగా ఈ బీచ్ ఫొటోలు ఆమెకు మరింత గుర్తింపు తీసుకొచ్చాయి. తెరపై సాధారణ యువతిగా కనిపించిన శివాని, ఈ చిత్రాల్లో మాత్రం హుందాతనం, సహజమైన అందంతో ఆకట్టుకోవడం విశేషం. ఈ ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వేగంగా వైరల్ అవుతుండగా, అభిమానులు ఆమె అందంపై ప్రశంసలు కురిపిస్తున్నారు. తదుపరి చిత్రాల ప్రకటన కోసం కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.మె నటనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. అయితే పాత్రకు పెద్దగా ప్రాధాన్యం లేకపోవడంతో ఆమె ప్రతిభ పూర్తిస్థాయిలో వెలుగులోకి రాలేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.
ప్రస్తుతం సినిమాలకు కొంత విరామం లభించిన నేపథ్యంలో శివాని వరుస ఫొటోషూట్లతో అభిమానులను అలరిస్తోంది. ముఖ్యంగా ఈ బీచ్ ఫొటోలు ఆమెకు మరింత గుర్తింపు తీసుకొచ్చాయి. తెరపై సాధారణ యువతిగా కనిపించిన శివాని, ఈ చిత్రాల్లో మాత్రం హుందాతనం, సహజమైన అందంతో ఆకట్టుకోవడం విశేషం.
ఈ ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వేగంగా వైరల్ అవుతుండగా, అభిమానులు ఆమె అందంపై ప్రశంసలు కురిపిస్తున్నారు. తదుపరి చిత్రాల ప్రకటన కోసం కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.